
# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



**కృష్ణా జిల్లా వార్తలు**

మంగళవారం 28 జనవరి 2025




రొయ్యూరు క్వారీలో నీటి ఊట బయట పడేవిధంగా ఇసుకను తోడుతున్న ఎక్స్‌కవేటర్

### జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు

# తూట్లు

## ప్రభుత్వ క్వారీల్లో యంత్రాలతో ఇసుక తవ్వకాలు

## రొయ్యూరు, నార్తువల్లూరు క్వారీల్లో బయటకొస్తున్న నీటి ఊట

- చేపల చెరువులను తలపిస్తున్న ఇసుక పాయలు
- యంత్రాలతో లోడింగ్ కోసం కార్మికులకు ప్రత్యేక ప్యాకేజీ
- మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు
- ఇసుక అక్రమ తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

తోట్లవల్లూరు మండలంలో నడుస్తున్న ప్రభుత్వ ఇసుక క్వారీల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు నిర్వహిస్తున్నారు. కార్మికుల స్థానంలో యంత్రాలను వినియోగించి ఇసుకను తోడేస్తున్నారు. నీటి ఊట బయటకు వచ్చి ఆయా ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు నిర్వాహకులు ఎక్కడికక్కడ తూట్లు పొడుస్తున్నారు. యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. ఈ అక్రమాలను అరికట్టాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు.

**తోట్లవల్లూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):** తోట్లవల్లూరు మండలంలో రొయ్యూరు, నార్తువల్లూరు గ్రామాల్లో ప్రభుత్వ క్వారీలు నడుస్తున్నాయి. రొయ్యూరు క్వారీకి రొయ్యూరులో నది ఒడ్డున, నార్తువల్లూరు క్వారీకి వల్లూరు పాలెంలో నది ఒడ్డున స్టాక్‌పాయింట్లు ఏర్పాటు చేశారు. గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనల ప్రకారం క్వారీలో యంత్రాలను వినియోగించకూడదు. కూలీలతో ట్రాక్టర్లలోకి ఇసుక లోడింగ్ చేసి స్టాక్ యార్డులకు తరలించాలి. స్టాక్ యార్డుల్లో వినియోగదారులు తీసుకువచ్చే వాహనంలోకి యంత్రాలతో ఇసుక లోడింగ్ చేయాలి. క్వారీల్లో ఇసుక తవ్వకాలతో పర్యావరణానికి, భూగర్భజలాలకు విఘాతం కలుగకూడదని గ్రీన్ ట్రిబ్యునల్ చెబుతోంది. క్వారీలకు అనుమతులిచ్చినపుడు కూడా ఇవే నిబంధనలను ప్రభుత్వం సూచించింది.

### కార్మికుల స్థానంలో యంత్రాల వినియోగం

అయితే ఈ రెండు క్వారీల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు. ముందుగా రొయ్యూరు క్వారీలో పగలు కార్మికులు, రాత్రి యంత్రాలను వినియోగించడం మొదలు పెట్టారు. రాత్రి మిగతా 6లో..



రొయ్యూరు ప్రభుత్వ క్వారీలో నిబంధనలకు విరుద్ధంగా ఎక్స్‌కవేటర్లతో లారీల్లోకి ఇసుక లోడింగ్

### కన్నెత్తి చూడని అధికారులు

ప్రభుత్వ ఇసుక క్వారీల్లో తవ్వకాలు ఎలా జరుగుతున్నాయి, ఇసుక పథకం అమలు ఎలా ఉంది, ప్రజలకు ప్రభుత్వం సూచించిన విధంగా ఇసుక అందుతోందా లేదా అని పర్యవేక్షించాల్సిన అధికారులు ఆ దరిదాపుల్లోకి కూడా రావటం లేదని తెలుస్తోంది. అధికారులెవ్వరు క్వారీల వైపు కన్నెత్తి కూడా చూడకపోవటానికి ముడుపుల బాగోతమే కారణమని పలువురు ఆరోపిస్తున్నారు.

### కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రభుత్వ ఇసుక క్వారీల్లో యంత్రాల వినియోగంపై సోమవారం కలెక్టర్ డీకే బాలాజీకి ఫిర్యాదు చేసినట్టు గరికపర్రుకు చెందిన సీపీఎం మండల మాజీ కార్యదర్శి వేమూరి కృష్ణబాబు తెలిపారు. అలాగే సీఎం కార్యాలయానికి కూడా ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి 'ఆంధ్రజ్యోతి' మరో అడుగు

- నేడు మచిలీపట్నం ఒకటో డివిజన్, విజయవాడ 13వ డివిజన్‌లో సమస్యలపై సదస్సులు




- ప్రజల చెంతకే రానున్న అధికారులు, ప్రజాప్రతినిధులు
- నేరుగా సమస్యలు విన్నవించుకునే వెసులుబాటు

'అక్షరమే ఆయుధం'గా అక్షర సేద్యం చేస్తున్న 'ఆంధ్రజ్యోతి' ప్రజా సమస్యల పరిష్కారానికి నడుం బిగించింది. కృష్ణాజిల్లా మచిలీపట్నం 1వ డివిజన్‌లోని ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీ, న్యూ హౌసింగ్ బోర్డు కాలనీ, సోమలీల, దేవుడిచెరువు, ఆనందపేట, పీకేఎం కాలనీల్లో సమస్యలు తిష్టవేశాయి. అధ్వానంగా రోడ్లు, పారుదలలేని మురుగు, కనీస వసతులు కరువైన పార్కు, వెలగని వీధి దీపాలు, కోతుల బెడద, నిలిచిపోయిన ఆర్టీసీ సర్వీసులతో ఆయా కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటిని గుర్తించిన 'ఆంధ్రజ్యోతి' అధికారులు, ప్రజాప్రతినిధులను ఆ ప్రాంతానికి తీసుకొచ్చేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీలోని మున్సిపల్ పార్కులో సదస్సు నిర్వహించనుంది. ఈ సదస్సులో ప్రజలు నేరుగా అధికారులు, ప్రజాప్రతినిధులకు తమ సమస్యలను విన్నవించి పరిష్కరించుకోవచ్చు.

- విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని 13వ డివిజన్ వాసులు తాగునీరు, వరదనీటి మళ్లింపు కాల్వలు (స్ట్రామ్ వాటర్ డ్రెయిన్లు), గుంతలమయంగా ఉన్న రోడ్లు, భూగర్భ మురుగునీటి పారుదల (యూజీడీ), దోమల, కుక్కల బెడద, విద్యుత్ సరఫరా, పార్కులు, పారిశుద్ధ్య లోపం వంటి సమస్యలతో నానా అవస్థలు పడుతున్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన 'ఆంధ్రజ్యోతి' అధికారులు, ప్రజాప్రతినిధులను ఆ ప్రాంతానికి తీసుకొచ్చేందుకు ఆటోనగర్ గేటు ఎదురు ఆర్టీసీ కాలనీ రామాలయం వద్ద మంగళవారం ఉదయం 10 గంటలకు సదస్సు నిర్వహించనుంది. ఈ సదస్సులో ప్రజలు నేరుగా అధికారులు, ప్రజాప్రతినిధులకు తమ సమస్యలను విన్నవించి పరిష్కరించుకోవచ్చు. ఆయా సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఆంధ్రజ్యోతి ప్రజలకు తోడుగా ఉంటుంది.

### పరిశుభ్రతతోనే అభివృద్ధి సాధ్యం

6లో





ఎన్టీఆర్ మోడల్ స్కూల్ విద్యార్థులతో నారా భువనేశ్వరి

### ● బాలలకు భువనేశ్వరి భరోసా

6లో

చల్లపల్లి మండలం పాగోలులో అనాథలు, పేదలకు విద్యనందిస్తున్న ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌ను ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు సతీమణి భువనేశ్వరి సోమవారం సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహారం నాణ్యతను పరిశీలించారు. క్లాస్ రూమ్, డిజిటల్ క్లాస్‌రూమ్, హాస్టల్ గదులను తనిఖీ చేసి విద్యార్థులతో ముచ్చటించారు. కష్టపడి చదవి ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచించారు. అమ్మ వలే అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

### నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

● ఎంపీ వల్లభనేని బాలశౌరి

6లో

### 'రిజర్వేషన్' లిక్కర్‌కు నోటిఫికేషన్ విడుదల

6లో

### సామాన్య భక్తులే వీఐపీలు

# ఇది వజ్రోత్సవ విజయం

## 60 ఏళ్లు పూర్తిచేసుకున్న కృష్ణా మిల్క్ యూనియన్

**ఫిబ్రవరి 11 నుంచి గ్రామాల్లో వేడుకలు ● బ్రోచర్ ఆవిష్కరణలో చైర్మన్ చలసాని ఆంజనేయులు**



వజ్రోత్సవ పోస్టర్, బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు, డైరెక్టర్లు

**చిట్టినగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** కృష్ణామిల్క్ యూనియన్ విజయవంతంగా 60 ఏళ్లు పూర్తి చేసుకుని వజ్రోత్సవం జరుపుకొంటోందని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఆనందం వ్యక్తం చేశారు. పాలఫ్యాక్టరీలోని సమావేశపు హాల్లో సోమవారం పాలకవర్గం, అధికారులు.. వజ్రోత్సవ వేడుకల బ్రోచర్, పోస్టర్‌ను ఆవిష్కరించారు. క్షీరవిప్లవ పితామహుడు డాక్టర్ కురియన్ సహకారంతో యూనిసెఫ్ ద్వారా ఎయిడెడ్ ఇంటిగ్రేటెడ్ మిల్క్‌ప్రాజెక్ట్ మంజూరైందని, 1965, ఫిబ్రవరి 11న ఈ యూనియన్‌కు తొలి అడుగు పడిందని, నాటి నుంచి ఆరు దశాబ్దాలుగా పాడి రైతుల అభివృద్ధికి, పాడి పరిశ్రమకు చిరునామాగా కృష్ణా యూనియన్ మారిందన్నారు. ఎందరో మహానుభావులు నిస్వార్థంగా సంస్థ ప్రగతికి కృషి చేశారన్నారు. ముఖ్యమంత్రిగా నందమూరి తారక రామారావు స్వయం ప్రతిపత్తి కల్పించారని చెప్పారు. 1997 తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు, వేతనాలు సైతం సకాలంలో చెల్లించలేని పరిస్థితిలో ఉన్న యూనియన్‌ను ఆదుకోవడానికి అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు చూపిన చొరవ మరువలేనిదన్నారు. కాగా, 60 ఏళ్ల కిందట పామర్రులో తొలి పాలసేకరణను 646 లీటర్లు, లీటరుకు 50 పైసల కొనుగోలుతో ప్రారంభించారని, ప్రస్తుతం 1,200 గ్రామాల్లో ఏటా 11 కోట్ల లీటర్ల పాలసేకరణ, రూ.1,200 కోట్ల వార్షిక టర్నోవర్‌కు చేరుకున్నామని చెప్పారు. రూ.200 కోట్ల మిగులు నిధులను సాధించగలిగిందన్నారు. లక్షా50వేల మంది పాడి రైతుల కుటుంబ సంస్థగా, ఉపాధి కల్పించే వనరుగా కొనసాగుతోందని చెప్పారు. దేశంలోనే అత్యధిక పాలసేకరణ ధర అందిస్తున్న సంస్థగా నిలిచిందన్నారు. ఐదేళ్లలో వార్షిక టర్నోవర్‌ను రూ.570 కోట్ల నుంచి రూ.1,200 కోట్లకు పెంచుకోగలిగామని, ఇతర పాల సహకార సంస్థలకు భిన్నంగా ప్రతి నాలుగు నెలలకోసారి లాభాలను పంచేలా రైతులకు బోనస్ అందజేస్తున్నామని చెప్పారు. 100కు పైగా ప్రోడక్టులను అందిస్తున్నామన్నారు. సభ్యుడైన పాడిరైతు చనిపోతే.. క్షీరబంధు పథకం కింద రూ.50 వేల సాయం అందిస్తున్నామని, ఇప్పటి వరకు 3 వేల కుటుంబాలను ఆదుకున్నామని పేర్కొన్నారు. సభ్యుల పిల్లలకు పెళ్లిళ్లు జరిగితే సంస్థ తరఫున బంగారు కాయిన్ అందజేసే 'కల్యాణమస్తు' పథకాన్ని చేపట్టామని, 4 వేల జంటలకు మిగతా 6లో..

### డాన్స్‌తో అదరగొట్టిన కలెక్టర్ దంపతులు



నిత్యం సమావేశాలు, సమీక్షలు, పర్యటనలతో క్షణం తీరికలేకుండా గడిపే కలెక్టర్ బాలాజీ తన సతీమణితో కలిసి సరదాగా డాన్స్ చేశారు. 'ఏ ఇడువనే ఇడువనే.. క్షణం కూడా నిన్నే.. బుజ్జమ్మా బుజ్జమ్మా.. ఏ మరువనే మరువనే కలల్లోనూ నిన్నే.. బుజ్జమ్మా బుజ్జమ్మా' అంటూ 'ఓరి దేవుడా..!' సినిమాలోని సాంగ్‌కు స్టెప్స్ వేసి అలరించిన ఘటన కలెక్టర్ బంగ్లాలో ఆదివారం నిర్వహించిన ఎట్‌హోం కార్యక్రమంలో జరిగింది.

-మచిలీపట్నం, జనవరి27(ఆంధ్రజ్యోతి)

### రహదారి పనుల్లో నిర్లక్ష్యం సహించం



● మంత్రి జనార్దనరెడ్డి

8లో

### మహా కుంభమేళాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు




8లో


ఫిల్టర్‌బెడ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న బాలశౌరి, బుద్ధప్రసాద్

## నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

» ఎంపీ వల్లభనేని బాలశౌరి

**ఘంటసాల/నాగాయలంక, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** సాగు, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. మండల పరిధిలోని యండకుదురు గ్రామంలో సీఎస్ఆర్ నిధులు రూ.15 లక్షలతో రక్షిత మంచినీటి పథకానికి సంబంధించి ఫిల్టర్ బెడ్‌కు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. అలాగే కమ్మనమోలు బీపీసీఎల్ సీఎస్ఆర్ నిధులు రూ.15 లక్షలతో రక్షిత మంచినీటి పథకం ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. దీనదయాళ్‌పురంలో సీఎస్ఆర్ నిధులు రూ.18.50 లక్షలతో 20వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణానికి, గుల్లలమోదలో పీఎఫ్‌సి సిఎస్ఆర్ నిధులు రూ.1,65,83,800లతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ అభివృద్ధి పనులు ప్రారంభించారు. రూ.12,08,300లతో మోటారు సేకరణ, ముంపునకు గురైన వ్యవసాయ పొలాల కోసం షెడ్ ఏర్పాటు పనులకు శంకుస్థాపనలు చేశారు. పవర్ డ్రిగ్ కార్పొరేషన్ సీఎస్ఆర్ నిధులు రూ.17 లక్షలతో సురక్షిత తాగునీటి పథకం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, తాగునీటి సమస్య గ్రామపంచాయతీలపై భారంగా మారిందన్నారు. ఈ విషయమై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, తాను ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వంలో సమస్యలు గాలికొదిలేశారని, కూటమి ప్రభుత్వం వచ్చాక పరిష్కారానికి నడుం బిగించామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ నందూరి రాజా, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

### నారా లోకేశ్ పాదయాత్రతో..

## ఏపీలో సరికొత్త అధ్యాయం

» ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



**వన్‌టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** 2024 ఎన్నికలకు ముందు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నారా లోకేశ్ నిర్వహించిన 'యువగళం' పాదయాత్ర రాష్ట్రంలో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించిందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. యువగళం పాదయాత్రకు రెండేళ్లు పూర్తయిన సందర్భం, లోకేశ్ దావోస్ పర్యటన విజయవంతం చేసినందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ, 226 రోజుల పాటు 3132 కిలోమీటర్ల మేర లోకేశ్ 'యువగళం' పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. తమకు కావాల్సిన ప్రజా ప్రభుత్వాన్ని ఓటు హక్కు ద్వారా సాధించుకున్నారనారు. లోకేశ్ కృషితో పారిశ్రామిక రంగం వెలుగులీనుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడు నెలల కాలంలోనే రూ.6.33 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, 4 లక్షల మందికి పైగా ఉద్యోగాలు కల్పించేందుకు కంపెనీలు ముందుకువచ్చాయనారు.

## సామాన్య భక్తులే వీఐపీలు

» వారి పట్ల మర్యాదగా వ్యవహరించండి

» దుర్గగుడి ఈవో రామచంద్రమోహన్

**వన్‌టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** ఇంద్రకీలాద్రిపై కనకదుర్గా మల్లేశ్వరుల దర్శనానికి వచ్చే భక్తుల పట్ల గౌరవంగా వ్యవహరించాలని దేవదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్, దుర్గగుడి పూర్తి అదనపు ఈవో కె.రామచంద్రమోహన్ ఆలయ అధికారులు, ఉద్యోగులకు హితవు పలికారు. ఇటీవల ఆలయానికి వచ్చిన ఓ భక్తుడు కాంట్రాక్ట్ ఉద్యోగిపై ఈవోకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేయడంతో.. సోమవారం ఈఈలు, ఏఈవోలు తదితరులతో ఈవో సమావేశమయ్యారు. ఉద్యోగులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని, సామాన్య భక్తులే వీఐపీలని, వారి పట్ల మర్యాద, మన్ననలు అవసరమని తెలిపారు. భక్తుల రద్దీ ఉండే శుక్ర, శని, ఆదివారాల్లో భక్తులు శీఘ్రంగా కదిలేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల పట్ల సహనంగా ఉండాలని, వారి ఆవేదన అర్థం చేసుకుని సానుకూలంగా మాట్లాడాలని తెలిపారు. భక్తుల వద్ద సెల్‌ఫోన్లు తనిఖీ చేసే విషయమై సెల్‌ఫోన్ కౌంటర్ సిబ్బంది ఎలా జోక్యం చేసుకుంటారని ప్రశ్నించారు. హద్దుమీరితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రోజుకు ఎంతమంది అన్న ప్రసాదం స్వీకరిస్తున్నారు.. సమయం ఎంత పడుతోందన్న దానిపై ఆయన ఆరాతీశారు. అన్నదాన డిపాజిట్ల వివరాలు, విరాళాలు వివరాలు ఇవ్వాలన్నారు.


ఆలయ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటును అడ్డుకుంటున్న వ్యాపారులు.. అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

## ఆలయ భూమిలో హెచ్చరిక బోర్డు

» అడ్డుకున్న వ్యాపారులు.. స్వల్ప వివాదం

**నందిగామ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** నందిగామ రామలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన రూ.15 కోట్ల విలువైన భూమి అన్యాక్రాంతంపై 'ఆంధ్రజ్యోతి' కథనానికి అధికారులు స్పందించారు. ఆలయానికి చెందిన 75 సెంట్ల భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు మట్టి నింపడంపై ధర్మకర్త మురళీరాఘవబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయ అధికారులు ఆలయ భూమిలోకి అక్రమంగా ప్రవేశిస్తే చర్యలు తప్పవని సోమవారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అయితే సదరు భూమిలో మట్టితోలిన వ్యాపారులు స్థలం ఆలయానిది కాదని, తమవద్ద డాక్యుమెంట్లు ఉన్నాయంటూ అడ్డుకొనే ప్రయత్నం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తడంతో రంగంలోకి దిగిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. స్వామివారి విలువైన ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు మిన్నకుండిపోవడంపై భక్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణదారులను అడ్డుకుని ఫెన్సింగ్ వేయించి ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

### ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు చెప్పండి

**బస్‌స్టేషన్ :** ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు సంయుక్త సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ పరిపాలన విభాగం ఈడీకి, ఆర్టీసీ ఎండీకి లేఖలు రాశారు. గ్యారేజీ, ఇతరత్రా సమస్యలను పరిష్కరించేందుకు సమావేశం ఏర్పాటు చేయాలని గతం నుంచి కోరుతున్నా సఫలీకృతం కాలేదన్నారు. సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. లేఖపై అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి సంతకం చేశారు.

# సూర్యఘర్ లక్ష్యం 1,10,000 మంది లబ్ధిదారులు

» రుణాల మంజూరుకు బ్యాంకర్లు కృషి చేయాలి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

**కృష్ణలంక, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ ప్యానెల్ కనెక్షన్‌ల ఏర్పాటుకు లక్షా పదివేలమంది లబ్ధిదారులకు రుణ మంజూరు లక్ష్యాలను పూర్తిచేసేందుకు బ్యాంకర్లు కృషిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. రుణాల మంజూరులో వెండర్స్ బ్యాంకర్స్ మధ్య సమన్వయం అవసరమని, సమష్టి కృషితో లక్ష్యాలను సాధించి ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించడంలో బ్యాంకర్లు భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. సూర్యఘర్ రుణాల మంజూరుపై సోమవారం కలెక్టరేట్‌లో బ్యాంకు అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సూర్యఘర్ పథకం ద్వారా జిల్లాలో 2లక్షల ఇళ్లకు సోలార్ విద్యుత్ ప్యానెల్స్‌ను అమర్చి జిల్లాను అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. లక్షా పదివేల లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్ధారించామన్నారు. ఇప్పటివరకు 787 మంది లబ్ధిదారులు రుణాలకు దరఖాస్తు చేసుకోగా.. 651 మంది 10 శాతం భాగస్వామ్యాన్ని చెల్లించడం జరిగిందన్నారు. లబ్ధిదారులు ఇంటి కప్పుపై ప్రభుత్వ రాయితీతో పాటు అతి తక్కువ ఖర్చుతో సోలార్ సిస్టమ్‌దను ఏర్పాటు చేసుకొని ఉచితంగా విద్యుత్‌ను వినియోగించుకొని ప్రజలకు కరెంటు బిల్లుల భారాన్ని తగ్గించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సూర్యఘర్ పథకం అమలుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిపెట్టాయన్నారు. లబ్ధిదారులు రూ. 2 లక్షల విలువైన 3 కేడబ్ల్యు సోలార ప్యానెలను రూ.78 వేల ప్రభుత్వ రాయితీతో ఇంటి పైకప్పుపై ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసుకోవలసి వుంటుందన్నారు. ప్రభుత్వ రాయితీ మినహా మిగలిన సొమ్మును బ్యాంకర్లు రుణంగా మంజూరు చేయవలసి వుంటుందన్నారు. కేటాయించిన లక్ష్యాల సాధనలో వెండర్లకు బ్యాంకర్లకు మధ్య సమన్వయం అవసరమన్నారు. బ్యాంకర్లు కాలయాపన చేయకుండా స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తక్షణమే రుణాలను మంజూరు చేయాలన్నారు. లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసిన నివేదికల వివరాలను ప్రతిరోజు సమర్పించాలని ఆయన అన్నారు. పథకం ద్వారా జిల్లాలో రెండు లక్షల కనెక్షన్లను లక్ష్యంగా నిర్దేశించుకొన్నామని ఇప్పటివరకు దాదాపు 65 వేల మంది లబ్ధిదారులు ప్యానెల్‌ను పొందేందుకు పేర్లను నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. స్వయం సహాయక సంఘం మహిళలు కూడా పెద్దయెత్తున రిజిస్ట్రేషన్ చేయించుకొంటున్నారన్నారు. సౌర శక్తి ద్వారా కాలుష్యం లేని పర్యావరణ హిత ఇంధనాన్ని పొందవచ్చునని, దరఖాస్తు చేసుకొన్న లబ్ధిదారులకు అవసరమైన రుణాలను తక్షణమే మంజూరు చేసి పథకం అమల్లో జిల్లాను అగ్రగామిగా నిలపడంలో బ్యాంకర్లు భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సమావేశంలో ఎల్‌డీఎం కె.ప్రియాంక, కేడీసీసీ బ్యాంకు ఏజీఎం వాసవి కుమారి, బ్యాంక్ ఆఫ్ బరోడ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంకు, కెనరా బ్యాంకు, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకు అధికారులు, సెవెన్ రేస్ నెట్ మ్యాటరింగ్, విజేత సోలార్ మార్కెటింగ్ ఏజెన్సీ, సూర్య పవర్ ట్రీ, ఆల్ఫా సోలార్ ఇంజినీర్స్, దక్షిణ్ సోలార్ పవర్, శ్రీ లక్ష్మీ మారుతీ ఇంజినీరింగ్, తదితర సోలార్ ప్యానెల్ పంపిణీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


చాంపియన్ ఆంధ్రప్రదేశ్ బాలికలు జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

### సెపక్ తక్రా చాంపియన్లు

## ఆంధ్రా, మణిపూర్

**లబ్బీపేట(స్పోర్ట్స్), జనవరి 27: (ఆంధ్రజ్యోతి):** స్కూల్ గేమ్స్ అండర్ 14జాతీయ సెపక్ తక్రా ఫైనల్స్‌లో బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్, బాలుర విభాగంలో మణిపూర్ జట్లు చాంపియన్‌లుగా నిలిచాయి. పటమట జడ్పీ హైస్కూల్‌లో సోమవారం జరిగిన ఫైనల్స్‌లో ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టు మణిపూర్‌పై 15-13, 17-15తో గెలుపొందింది. బాలుర విభాగంలో మణిపూర్ జట్టు, బీహార్‌పై 15-2, 15-5తో గెలుపొందింది. అనంతరం జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొని విజేత జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి భానుమూర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతతోనే అభివృద్ధి

» ఏడాదిలో నెలకో థీమ్

» స్వచ్ఛాంధ్ర నిర్వహణకు రాష్ట్ర, జిల్లా సమన్వయకర్తల నియామకం

» కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్


స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు

**వన్‌టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తలపెట్టిన స్వచ్ఛదివస్ కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు ఏడాదిలో ప్రతినెలకో థీమ్ ఉంటుందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ సంబంధిత అధికారులతో అన్నారు. సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ దివస్‌ను నిర్వహిస్తామని, ఇందుకు ప్రతినెలకూ ఒక థీమ్ ఉంటుందని తెలిపారు. న్యూ ఇయర్ క్లీన్ స్టార్ట్ పేరిట ఇప్పటికే కార్యక్రమాన్ని నిర్వహించామని, ఫిబ్రవరి నెలకు సోర్స్ రిసోర్స్, మార్చి నెలకు 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు స్టాప్ చెప్పండి' అనే థీమ్‌తో కార్యక్రమాలు నడుస్తాయన్నారు. ఇదే సమయంలో త్వరలో బ్రాండ్ అంబాసిడర్‌ను కూడా నియమిస్తామని చెప్పారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు విజయవంతం చేయడం కోసం రాష్ట్ర, జిల్లాస్థాయి నోడల్ అధికారులను నియమిస్తున్నట్టు తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించాలన్నారు. సీఎం చంద్రబాబు స్వచ్ఛాంధ్ర సాధనకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ, ప్రభుత్వ అధికారులను కూడా భాగస్వాములను చేస్తున్నారన్నారు. నోడల్ అధికారులు వినూత్న ఆలోచనలతో ముందుకు వస్తే స్వాగతిస్తామని తెలిపారు. పరిశుభ్రత లేకపోతే ఎంత అభివృద్ధి జరిగినా వృథానేనని తెలిపారు. నోడల్ అధికారులుగా అన్ని శాఖలకు చెందిన అధికారులు ఉన్నారని, వారందరి సహకారం ఉంటేనే ముఖ్యమంత్రి తలపెట్టిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర సాధ్యమవుతుందని తెలిపారు. ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సహాయంతో స్వచ్ఛాంధ్రను విజయవంతం చేస్తామన్నారు.

### పేద, అనాథ పిల్లలకు విద్యా ప్రదాయిని

# పాగోలు ఎన్టీఆర్ మోడల్ స్కూల్


» స్కూల్‌ను సందర్శించిన నారా భువనేశ్వరి » పిల్లలతో కలిసి భోజనం.. వసతి సౌకర్యాలపై ఆరా


నారా భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న స్కూల్ విద్యార్థులు, ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నారా భువనేశ్వరి, టీడీపీ నేతలు కనపర్తి శ్రీనివాసరావు తదితరులు

**చల్లపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** అనాథలు, పేదలకు విద్యాదానం చేస్తున్న ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌ను ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి సోమవారం సందర్శించారు. చల్లపల్లి మండలం పాగోలులో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న మోడల్ స్కూల్‌లో సుమారు 350 మందికి పైగా విద్యార్థినీవిద్యార్థులు చదువుకుంటున్నారు. సోమవారం ఉదయం భువనేశ్వరి పాఠశాలను సందర్శించగా విద్యార్థులు ట్రస్ట్ జెండాలు చేతబూని కవాతు నిర్వహిస్తూ స్వాగతం పలికారు. ఎన్టీఆర్ ట్రస్ట్ పతాకాన్ని ఆవిష్కరించిన భువనేశ్వరి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. క్లాస్ రూమ్, డిజిటల్ క్లాస్‌రూమ్, హాస్టల్ గదులు పరిశీలించారు. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించి విద్యార్థులతో సౌకర్యాలు ఎలా ఉన్నాయంటూ ఆరాతీశారు. కార్యక్రమంలో డైరెక్టర్ పి.వెంకటేశ్వర్లు, సీవోవో అడుసుమిల్లి గోపి, యోగంనాయుడు, ప్రిన్సిపాల్ జి.మధుసూధనరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ స్కూల్‌ను తరచుగా సందర్శిస్తు.. స్కూల్‌లో పిల్లలను ఎలా చూసుకుంటున్నారు, ఫ్యాకల్టీ ఎలా చెబుతున్నారనే విషయాలు గ్రౌండ్ లెవల్‌లో చూస్తేనే నమ్ముతానని భువనేశ్వరి అన్నారు. గండిపేటలో స్కూల్, ఉమెన్స్ కాలేజీ నడుపుతున్నామనీ, వాటిలో వచ్చిన లాభాలను స్కూల్ నిర్వహణకు ఖర్చుచేస్తామన్నారు. ప్రస్తుతం హైస్కూల్‌లో 350కి పైగా పిల్లలు చదువుతున్నారనీ, ఏటా 40మందిని కొత్తగా తీసుకుంటున్నామని తెలిపారు. చదువుతోపాటు ఉచితంగా భోజనం, వసతి సౌకర్యాలు అందిస్తున్నట్టు వివరించారు. అనంతరం నారా భువనేశ్వరి తిరిగివెళుతూ చల్లపల్లి రాజా కోటను సందర్శించారు. శాఖమూరి వెంకట చలపతిబాబు కోట వివరాలను భువనేశ్వరికి తెలియచేశారు. చల్లపల్లి ఎన్టీఆర్ పార్కులో నూతనంగా ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి నారా భువనేశ్వరి నివాళులు అర్పించారు. టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్దఎత్తున అక్కడకు చేరుకుని భువనేశ్వరికి స్వాగతం పలికారు. భువనేశ్వరిని ఎన్నారై బొబ్బా గోవర్ధన్, టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు, మండల నేతలు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

## అర్జీలు పరిష్కరించండి

» కృష్ణా కలెక్టర్ బాలాజీ


ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ

**మచిలీపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారంలో ప్రజల సంతృప్తస్థాయి పెరగాలని కృష్ణా కలెక్టర్ బాలాజీ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జేసీ గీతాంజలిశర్మ, ఇతర అధికారులతో కలిసి ఆయన ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాసమస్యలపై వచ్చిన అర్జీలను సమగ్రంగా పరిశీలించి, విచారణచేసి సకాలంలో అధికారులు పరిష్కారం చూపాలన్నారు. జేసీ గీతాంజలిశర్మ మాట్లాడుతూ వివిధశాఖల్లో కోర్టుకేసులపై అధికారులు వెంటనే స్పందించాలన్నారు. కోర్టుధిక్కరణ కేసులు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు మాట్లాడుతూ, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి అర్జీల పరిష్కారంపై వివరాలు తెలుసుకునేందుకు అధికారులకు ఫోన్‌చేస్తే, కొందరు అధికారులు స్పందించడం లేదని, ఈ విధానాన్ని విడనాడాలన్నారు. వాట్సాప్‌గ్రూప్‌లో ఎప్పటికప్పుడు ఇస్తున్న సూచనలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్డీవో కె.స్వాతి, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డీపీవో జె.అరుణ, డీఎంఅండ్‌హెచ్‌వో శర్మిష్ట, వ్యవసాయ శాఖ జేడీ పద్మావతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ దోపిడీ అరికట్టాలి

» కలెక్టర్‌కు విద్యార్థి సంఘాల నేతల వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

**కృష్ణలంక, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీ, ఫీజు బకాయిలతో సంబంధం లేకుండా విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు ఇవ్వాలని, విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ కమిటీ వేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపులో భాగంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ వద్ద ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ, ఉపాధ్యక్షులు ఎం.సాయికుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్ మాట్లాడుతూ, నగరంలో కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక సంఖ్యలో ఫీజుల దోపిడీ చేస్తూ విద్యార్థుల ప్రాణాలు పోతున్నా ఫీజులు మాత్రమే ముఖ్యమనే తీరులో వ్యవహరిస్తున్నారని కలెక్టర్‌కు విన్నవించారు. ఫీజులు చెల్లించకపోతే మానసికంగా హింసిస్తున్నారన్నారు. కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన కళాశాల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే విద్యార్థుల పక్షాల ఉద్యమిస్తామని తెలిపారు. విద్యార్థి సంఘాల నేతలు సాదిక్ బాబు, కార్తీక్, అవినాష్, మధు, కుమార్‌స్వామి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

### రిజర్వేషన్ లిక్కర్‌కు

## నోటిఫికేషన్ విడుదల

» జిల్లాలో 11 షాపులు గీత కార్మికులకు కేటాయింపు

» దరఖాస్తుల స్వీకరణకు ఆఖరు తేదీ ఫిబ్రవరి 5

» ఎక్సైజ్ స్టేషన్లలో రిజిస్ట్రేషన్‌కు అవకాశం

» 10న లాటరీ ద్వారా షాపుల కేటాయింపు



**(ఆంధ్రజ్యోతి, విజయవాడ):** గీత కార్మికులకు మద్యం షాపులను కేటాయించే ప్రక్రియకు అడుగులు పడ్డాయి. ఎన్టీఆర్ జిల్లాలో 11 షాపులను గీత కార్మికులకు కేటాయిస్తున్నట్టు కొద్దిరోజుల క్రితం అధికారులు ప్రకటించారు. ఏఏ ప్రాంతాల్లో షాపులను కేటాయించారో దానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను కలెక్టర్ లక్ష్మీశ సోమవారం వెల్లడించారు. మంగళవారం నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అదేవిధంగా జిల్లాలో ఉన్న ఎనిమిది ఎక్సైజ్ స్టేషన్లలో రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఇచ్చారు. అభ్యర్థులు ఫిబ్రవరి 5 సాయంత్రం 5గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు కాపీని సంబంధిత ఎక్సైజ్ స్టేషన్‌లో అందజేయాలి. దుకాణాల కేటాయింపునకు సంబంధించిన లాటరీని ఈనెల 7న ఉదయం 10గంటలకు గొల్లపూడిలో ఉన్న బీసీ భవన్‌లో తీస్తారు. అభ్యర్థులు నివాస, కుల ధ్రువీకరణపత్రాలను జత చేస్తూ రూ.2లక్షలను దరావత్తు రుసుముగా చెల్లించాలి.

**రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఇవే..**

విజయవాడ గురునానక్ కాలనీలో ఎక్సైజ్ తూర్పు స్టేషన్, సీతారామపురంలోని విజయ వెస్ట్, పాత హెచ్‌బీ కాలనీలో ఉన్న భవానీపురం ఎక్సైజ్ స్టేషన్, మైలవరం, నందిగామ, కంచికచర్ల, జగ్గయ్యపేట, తిరువూరు ఎక్సైజ్ స్టేషన్లు.

**కృష్ణా జిల్లాలో 12 షాపులు**

**మచిలీపట్నం :** గీతకులాలకు కృష్ణా జిల్లాలో 12మద్యం దుకాణాలను కేటాయిస్తూ ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ జి.గంగాధరరావు సోమవారం నోటిఫికేషన్ జారీచేశారు. ఫిబ్రవరి 7న కలెక్టరేట్‌లో మద్యంషాపులను లాటరీ పద్ధతిన కేటాయించడం జరుగుతుందన్నారు. దుకాణాలకు దరఖాస్తుచేసే సమయంలో కులం, ఉపకులానికి సంబంధించిన ధృవపత్రాలు తప్పనిసరిగా సమర్పించాల్సి ఉందన్నారు. వివరాలను ఎక్సైజ్‌కార్యాలయంలో సంప్రదించాలని సూపరింటెండెంట్ తెలిపారు.


నార్తువల్లూరు క్వారీలో చెరువును తలపిస్తున్న ఇసుక తవ్వకం

## జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు తూట్లు

(5వ పేజీ తరువాయి)

సమయాల్లో స్టాక్‌యార్డుతో సంబంధం లేకుండా క్వారీ నుంచి నేరుగా యంత్రాలతో పెద్ద లారీల్లోకి లోడింగ్ చేసి రవాణా చేస్తున్నారు. ఇందుకు గాను కార్మికులకు రోజుకు రూ.40 వేలు చెల్లిస్తున్నారు. ఇలా యంత్రాలను వినియోగించి నిబంధనలను అతిక్రమించినా చర్యలు లేకుండా అధికారులకు పెద్దమొత్తంలో ముడుపులు ముట్టజెప్పినట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం రొయ్యూరులో పగటి పూట సైతం యంత్రాలతో ఇసుక లోడింగ్ చేయడం నిబంధనల ఉల్లంఘనకు పరాకాష్ఠగా నిలిచింది. క్వారీల్లోకి బయట గ్రామాల నుంచి వచ్చే ట్రాక్టర్లకు క్వారీలో ఇసుక లోడింగ్ చేస్తున్నందుకు రొయ్యూరులో రూ.500 వసూలు చేస్తుండగా, తోట్లవల్లూరు అనధికార క్వారీలో రూ.700 వరకు వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇక నార్తువల్లూరు క్వారీలో రాత్రి సమయంలో యంత్రాలతో లారీల్లోకి ఇసుక లోడింగ్ చేయడం మొదలు పెట్టడంతో కార్మికులు ధర్నాలు చేశారు. దీంతో కార్మికులకు రోజుకు రూ.35 వేలు చెల్లించి యంత్రాలను నిర్భీతిగా వినియోగిస్తున్నారు. కార్మికులు తోట్లవల్లూరు పాయలో పగలు పనిచేస్తూ ట్రాక్టర్లలోకి ఇసుక నింపుతున్నారు.

**చేపల చెరువులను తలపించేలా..**

రొయ్యూరు, నార్తువల్లూరు ప్రభుత్వ క్వారీల్లో యంత్రాల వినియోగంతో భూగర్భ జలాలు బయటపడే విధంగా ఇసుక తవ్వడంతో చేపల చెరువులను తలపించే విధంగా ఆ ప్రదేశాలు తయారయ్యాయి. ఈ తవ్వకాలతో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉందని కొందరు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**క్వారీలు తనిఖీ చేస్తాం : తహసీల్దార్**

ఇసుక క్వారీల్లో నిబంధనల ఉల్లంఘనపై తహసీల్దార్ ఎం.కుసుమకుమారిని వివరణ కోరగా క్వారీల్లో యంత్రాల వినియోగం తెలియదన్నారు. ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమే క్వారీల్లో కార్మికులతో తవ్వకాలు జరగాలని తెలిపారు. స్టాక్ యార్డుల్లో 24 గంటలు ఇసుక విక్రయించవచ్చని చెప్పారు. క్వారీలను తనిఖీ చేస్తామని తెలిపారు.

## ఇది వజ్రోత్సవ విజయం

(5వ పేజీ తరువాయి)

అందించామని చలసాని తెలిపారు. పిల్లలకు ప్రతిభ పథకం, రైతులకు హెల్త్‌కార్డులు, వైద్యశిబిరాల నిర్వహణ, గుండె శస్త్రచికిత్సలు వంటివి చేస్తున్నామన్నారు. నిరంతరం పశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు 12 వెటర్నరీ అంబులెన్సులు కొనడంతో పాటు 40 మంది వరకూ వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. పశువులకు రూ.లక్ష బీమా సదుపాయం కల్పించామని, రాయితీపై పశుదాణా, ఆరోగ్యకరమైన పశు సంతానంలో మేలుజాతి వృద్ధికి కృత్రిమ వీర్య పంపిణీ వంటి ఏర్పాట్లనూ సంస్థ చేపట్టిందన్నారు. ప్రతి లీటర్ పాలపైనా రూ.2 సంక్షేమం కోసమే ఖర్చు చేస్తున్నామన్నారు. దీర్ఘకాలంగా కన్సాలిడేటెడ్ వేతనంపై పనిచేస్తున్న 390 మంది ఉద్యోగులను ఈ ఐదేళ్లలో పర్మినెంట్ చేశామన్నారు.

**వైసీపీ కుటిల ప్రయత్నాలను వమ్ము చేస్తూ..**

కృష్ణా మిల్క్ యూనియన్ అంటే.. లక్షన్నర కుటుంబాల సమష్టి కృషి అని, గత ప్రభుత్వం అమూల్ వంటి ఇతర రాష్ట్రాలకు చెందిన సంస్థను తెచ్చి, పోటీకి పెట్టి దెబ్బతీయాలని చూసినా.. సమష్టి కృషితో ఆ ప్రయత్నాలను వమ్ము చేయగలిగామన్నారు. ఎన్నో ఇబ్బందులు అధిగమించి సుమారు రూ.165 కోట్లతో వీరవల్లిలో నిర్మించిన స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ కామధేను ప్లాంటును త్రిదిండి చినజీయర్‌స్వామి చేతులమీదుగా ప్రారంభించామన్నారు. ఈ విజయం కృష్ణా మిల్క్ యూనియన్ సభ్యులందరిదన్నారు. ఈ వజ్రోత్సవాల్లో పాడిరైతు సంక్షేమం, వినియోగదారుల సంతృప్తి, ఉద్యోగుల ప్రయోజనం.. అనే మూడు సూత్రాలను ముందుకు తీసుకెళ్లాలని ప్రతిన పూనుతున్నామని, ఫిబ్రవరి 11 నుంచి గ్రామాల్లో ఘనంగా వేడుకలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ కొల్లి ఈశ్వరబాబు, పలువురు డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి (రూ.లలో)

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 130, 139, 150 |
| చికెన్ విత్ స్కిన్ | 250 |
| చికెన్ స్కిన్‌లెస్ | 260 |



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 480

## పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ఉయ్యూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** పీఎం సూర్యఘర్ యోజన పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఎంపీడీవో జీఎస్వి శేషగిరిరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్వయం సహాయక సంఘాల లీడర్లకు సూర్యఘర్ యోజన పథకం వివరాలు తెలియజేసి ఇంటింటా ప్రచారం చేయాలన్నారు. ఈ పథకం వల్ల గృహ వినియోగదారులకు అతితక్కువ విద్యుత్‌బిల్లు వస్తుందని, సామాన్య గృహ యజమానులు ఇంటిపైకప్పుపై 10 చదరపు మీటర్ల స్థలంలో 1కేపీ డబ్ల్యుపి సామర్థ్య కలిగిన సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఈ పథకానికి తక్కువ వడ్డీకి బ్యాంకు రుణాలు లభిస్తాయని వివరించారు.



బాపులపాడు శివాలయంలో రుద్రాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

## ఘనంగా రుద్రాభిషేకం

**హనుమాన్‌జంక్షన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** స్థానిక బాపులపాడు శ్రీభ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జునస్వామి దేవస్థానంలో సోమవారం త్రయోదశి సందర్భంగా స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు బాదంపూడి అరుణ్‌కుమార్ మల్లికార్జునస్వామికి రుద్రాభిషేకం, నందీశ్వరుడికి అభిషేకం, హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అభిషేక రుసుం చెల్లించిన భక్తులకు ఉచితంగా పూజా సామగ్రి, అభిషేక ద్రవ్యాలను ఆలయ కమిటీ అందించింది. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు గూడవల్లి చిన్నా, తమిరి రమేష్, గొట్టిపాటి రాంబాబు, కొల్లి వెంకట్రావు, వీరమాచనేని నాగయ్య పాల్గొన్నారు.

## అరుణాచలానికి ఆర్టీసీ సర్వీసు

**ఉయ్యూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** ఉయ్యూరు ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలానికి ఫిబ్రవరి 1న ప్రత్యేక బస్సు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ కేఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. రాత్రి 8 గంటలకు సూపర్‌లగ్జరీ బస్సు బయలు దేరుతుందని, వివరాలకు 7382893468, 91899366868 సెల్ నంబర్లకు ఫోన్ చేయవచ్చని, చార్జీ ఒక్కరికి రూ. 3,500గా తెలిపారు.



## కొత్త స్తంభాల ఏర్పాటు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

**ఉయ్యూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల రోడ్డులో ఎట్టకేలకు కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. రోడ్డులో ఎప్పటి నుంచో ఉన్న ఇనుప స్తంభం తుప్పుపట్టి, పక్కనే ఉన్న సిమెంట్ స్తంభం విరిగి ఎప్పుడు కూలతాయో తెలియక ప్రమాదకరంగా ఉన్న పరిస్థితిని 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఇటీవల ప్రచురితమైన కథనానికి స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు స్తంభాలు తొలగించి వాటి స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేశారు.

## కుళాయిల్లో మురికి నీరు



**ఉయ్యూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** ఆకునూరు బీసీ కాలనీలో కుళాయిలద్వారా మురికినీ రు రావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గ్రామ పంచాయతీ కుళాయిలద్వారా సరఫరా చేస్తున్న రక్షిత తాగునీరు కొద్దిరోజు లుగా మురికిగా వస్తున్న విషయాన్ని పంచాయతీ సిబ్బందికి తెలియజేసినా పట్టించుకున్నవారు లేరని వాపోతున్నారు. కుళాయి నుంచి వస్తున్న నీరుమురికి వాసనతో ఉండటంతో తాగేందుకు నీరులేక ఇబ్బంది పడుతున్నామని, ఆర్వో ప్లాంట్ల నుంచి తాగేనీరు కొనుగోలు చేయవలసి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# గ్రామాల్లో అభివృద్ధి పరుగులు

**ఎమ్మెల్యే బోడె ప్రసాద్**



రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, పక్కన నెరుసు, రమణ, తుమ్మలపల్లి తదితరులు

**కంకిపాడు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** కూటమి ప్రభుత్వం రాకతో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని, ప్రాధాన్యత క్రమంలో కంకిపాడులో నెలకొన్న సమస్య లు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. రూ. 76 లక్షలతో చేపట్టిన రోడ్డు అభివృద్ధి పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయన్నారు. గత ప్రభుత్వం కంకిపాడు అభివృద్ధిలో పూర్తిగా నిర్లక్ష్యం వహించిందన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రూ. 1.19 కోట్లు మంజూరు చేసిందని, రెండు నెలల్లోనే రూ. 76 లక్షలతో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టామని, కంకిపాడు ప్రధాన రహదారికి ఇరువైపుల డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, సర్పంచ్ బాకి రమణ, వైస్ ఎంపీపీ దూళిపూడి కిషోర్, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సుదిమళ్ల రవీంద్ర, బండి నాంచారయ్య, పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, గోగినేని వెంకటరమణ, చలవాది రాజ, ఏనుగ జయప్రకాష్, వణుకూరు విక్రం, కళ్యాణి, శివపార్వతి, జనసేన పార్టీ ప్రచార కమిటీ జిల్లా కో-ఆర్డినేటర్ పులి శ్రీనివాసరావు, బోయిన నాగరాజు, కోనా జనార్ధనరావు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## వృత్తి విద్యాకోర్సుల విద్యార్థుల క్షేత్రస్థాయి సందర్శన

**ఉయ్యూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** వృత్తి విద్యాకోర్సులతో విద్యా ర్థులకు మెరుగైన భవిష్యత్తు ఉంటుందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె జ్యోత్స్నాదేవి అన్నారు. పాఠశాల వృత్తివిద్యాకోర్సుల విద్యార్థుల క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా సోమవారం నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్, ఐఆర్ టీసీ ఆధ్వర్యంలో కేసీపీ చక్కెర కర్మాగారాన్ని సందర్శించారు. చెరకు క్రషింగ్ నుంచి పంచదార తయారయ్యే వరకు జరిగే ప్రాసెస్‌ను భద్రతా పరికారాలతో వీక్షించారు. కర్మాగారంలో, యంత్రాల పనితీరును సిబ్బంది వివరించారు. ఒకేషనల్ ట్రైనర్ ఆర్ సురేఖ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కేసీపీ చక్కెర కర్మాగారంలో ఒకేషనల్ విద్యార్థుల క్షేత్రస్థాయి సందర్శన



మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మూర్తి

## రహదారి భద్రత నియమాలు పాటించాలి

**ఎంవీఐ జీవీఎస్ఎన్ మూర్తి ● ఆకట్టుకున్న బుర్రకథ**

**గన్నవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** వాహనదారులు రహదారి భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఎంవీఐ జీవీఎస్ఎన్ మూర్తి అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు సందర్భంగా సోమవారం గన్నవరం వాహన పట్టుత్వ కేంద్రం వద్ద డ్రైవర్‌లకు బుర్రకథ బృందం ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మూర్తి మాట్లాడుతూ, ఏడాదికి 5లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారని, 1.50 లక్షల మంది క్షతగాత్రులవుతున్నారని గణాంకాలు చెబుతున్నాయన్నారు. ప్రతి డ్రైవర్ బాధ్యతగా వ్యవహరించాలని, తన వెనుక ఉన్న కుటుంబం గురించి ఆలోచించాలని, ముఖ్యంగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని, జీవితం ఎంతో విలువైనదని, రహదారి ప్రమా దాలతో జీవితాన్ని వృధా చేసుకోవటం అవివేకమన్నారు. ట్రాఫిక్‌రూల్స్ పాటించి రహదారి ప్రమా దాలను నివారించి విలువైన ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. ఎంవీఐ ఎ.ఉదయ్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





సీఎండీ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న ఈఈ హరిబాబు..
కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న ఎంపీడీవో ప్రణవి

## ఉత్తమ ఈఈ హరిబాబుకు సన్మానం

**పెనమలూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏపీసీపీడీసీఎల్ పరిధిలోని గుణదల డివిజన్ ఈఈ పరిమి హరిబాబుకు ఉత్తమ ఈఈ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా సోమవారం అధికారులు, కార్మిక సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ ఈఈగా ఎంపికైన హరిబాబును తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏడీఈ నవీన్ మాట్లాడుతూ, గుణదల డివిజన్ పరిధిలో కానూరు, పటమట, గుణదల సబ్ డివిజన్లలో వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి ఈఈ హరిబాబు నేతృత్వంలోని అధికారులు ఉత్తమ సేవలు అందిస్తున్నారని తెలిపారు.

● పెనమలూరు ఎంపీడీవో ప్రణవి ఉత్తమ పురస్కారం అందుకోవడం అభినందనీయమని మండల పరిషత్ కార్యాలయ అధికారులు సిబ్బంది అన్నారు. ఉత్తమ పురస్కారం అందుకొన్న ప్రణవిని అధికారులు, కార్యాలయ సిబ్బంది కలిసి సోమవారం అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, పక్కన జనసేన నేతలు

## రాష్ట్ర భవిష్యత్‌ను మార్చిన యువగళం

**● ప్రారంభించి రెండేళ్లు పూర్తి ● హామీలు నెరవేరుస్తున్న మంత్రి లోకేశ్ ● ఎమ్మెల్యే బోడె ప్రసాద్**

**కంకిపాడు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** యువగళం పాదయాత్ర రాష్ట్ర భవిష్యత్తును మార్చిందని, ఇచ్చిన హామీలను మంత్రి నారా లోకేశ్ నెరవేరుస్తున్నారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడు టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 27వ తేదీతో యువగళం ప్రారంభించి రెండేళ్లు పూర్తి అయిందన్నారు. యువగళంకు బెంబేలెత్తిపోయిన వైసీపీ ప్రభుత్వం యువగళం పాదయాత్రను అడ్డుకునేందుకు అనేక అడ్డంకులు సృష్టించిందని, అనుమతులు లేవంటూ మైకులు కట్ చేయడం, అనుమతులు లేవంటూ స్టేజీలు తొలగించినా చేతి మైక్‌తో కుర్చీలపై నిలబడి ప్రసంగించారని గుర్తుచేశారు. అదే విధంగా నటరత్న బాలకృష్ణకు పద్మభూషన్ అవార్డును కేంద్ర ప్రభుత్వం ప్రకటించటం హర్షణీయమని తెలియజేశారు. ఈ సమా వేశంలో జనసేన పార్టీ ప్రచార కమిటీ జిల్లా కో- ఆర్డినేటర్ పులి శ్రీనివాసరావు, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, బీజేపీ నాయకులు దివి రోహిణి కుమార్, బీజేపీ మండల అధ్యక్షులు గుళ్లపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**గన్నవరం :** రెండేళ్ల క్రితం యువనేత నారా లోకేశ్ ప్రారంభించిన యువగళం పాదయాత్ర రాష్ట్ర భవిష్యత్‌ను మార్చివేసిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనమే బలమై, బలగమై లోకేష్‌కు అండగా నిలిచారని, రాష్ట్రాన్ని కాపాడటంలో యువగళం పాదయాత్రలో లోకేశ్ వేసిన ప్రతి అడుగు తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో నమ్మకం కల్పించిందని పేర్కొన్నారు. తాను లోకేశ్ సమక్షంలో పార్టీలో చేరి భారీ బహిరంగ సభను నిర్వహించామని, దీంతో కేసులు పెట్టడం ప్రారంభించారని పేర్కొన్నారు.

## కంటి గాయాలతో దృష్టిలోపం సమస్యలు

**ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి వైద్యుడు సుష్యాంక్ అశోక్ భలేరావ్**

**పెనమలూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** చిన్నచిన్న కంటి గాయాల పట్ల నిర్లక్ష్యం వహించరాదని, పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సుష్యాంక్ అశోక్ భలేరావ్ అన్నారు. సోమవారం తాడిగడపలోని ఆసుపత్రి ఆవరణలో కంటికి తగిలే గాయాలు (ఓక్యులర్ ట్రామా) గురించి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, చిన్న గీతలు నుంచి తీవ్రమైన గాయాలు దృష్టి జీవన నాణ్యతపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయని తెలిపారు. దీనివల్ల దృష్టి లోపం కలిగే అవకాశం ఉందని , ప్రమాదాలు, క్రీడలు, రసాయనాలు, బాణసంచా గాయాలు 30సంవత్సరాల కంటే తక్కువ ఉన్న వారిలో ఏభై శాతంపైగా సంభవించాయని అధ్యయనాలు చెబుతున్నాయని, చిన్నగాయమే కదా అని నిర్లక్ష్యం వహించకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

## ఇరువర్గాల ఘర్షణ - ఆరుగురికి గాయాలు

**ఉయ్యూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** గ్రానైట్ దిగుమతి చేసేందుకు గుంటూరు నుంచి వచ్చిన ముఠా కార్మికులపై స్థానిక ముఠా కార్మికులు దాడి చేయడంతో ఆరుగురికి గాయాలైన సంఘటన సోమవారం ఉయ్యూరులో జరిగింది. కాటూరు రోడ్డు అడితీ బజార్‌లో లారీనుంచి గ్రానైట్ దిగుమతి చేసేందుకు గుంటూరు నుంచి కార్మికులు రాగా స్థానిక ముఠా కార్మికులు అక్కడకు చేరు కుని మా ప్రాంతానికి వచ్చి మీరు దిగుమతి చేసేందుకు వీలు లేదంటూ అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘటనలో గుంటూరుకు చెందిన నలుగురికి తీవ్రంగా, ఇద్దరికి స్వల్ప గాయాలవ్వగా ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స చేయించుకున్నారు. కార్మికుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## క్విజ్‌లో పెదఅవుటపల్లి విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న ముఖ్యఅతిథులు

**ఉంగుటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయటంలో క్విజ్‌పోటీలు ఎంతగానో దోహదపడతాయని పెదఅవుటపల్లి శ్రీసాయి శ్రీనివాసా హైస్కూల్ ప్రిన్సిపాల్ కేజీఎస్ సాయిబాబా అన్నారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పాఠశాలలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్విజ్‌పోటీల్లో విజేతలైన గన్నవరం స్రవంతి హైస్కూల్, వీరవల్లి విశ్వభారతి హైస్కూల్, హనుమాన్‌జంక్షన్ గీతాంజలి హైస్కూల్ విద్యార్థులకు ఆయన ముఖ్యఅతిథులతో కలిసి ఆయన నగదు బహుమతులు, ట్రోఫీలు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా అవనిగడ్డ ప్రగతి విద్యాసంస్థల అధినేత శనగా పూర్ణచంద్రరావు, గన్నవరం మల్లికార్జున విద్యాసంస్థల అధినేత నక్కిన చినవెంకట్రాయుడు, స్రవంతి హైస్కూల్ ప్రిన్సిపాల్ కొమ్మినేని రామకృష్ణ, హనుమాన్‌జంక్షన్ గీతాంజలి హైస్కూల్ ప్రిన్సిపాల్ వీడీఎస్ ప్రసాద్ విజేతలను అభినందించారు.

## ఆటల పోటీల విజేతలకు అభినందన



హెచ్‌ఎం లూథర్‌పాల్, ఉపాధ్యాయులు, కలపాల రాధాకృష్ణ, యనమదల సుధాకర్

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** గన్నవరంలో జరి గిన సబ్‌జోన్ వాలీబాల్ పోటీల్లో రేమల్లె హైస్కూల్ విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. సోమవారం విజేతలను హెచ్ ఎం లూథర్ పాల్ అభినందించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు డి.వెంకటేశ్వరరావును గ్రామ ప్రముఖులు కలపాల రాధాకృష్ణ, యనమదల సుధాకర్, ఎస్ఎంసీ చైర్మన్ సొదిమెళ్ల శ్యామ్ తదితరులు అభినందించారు.

## ఉంగుటూరు ఎంపీడీవోకు సన్మానం



ఎంపీడీవో సత్యకుమార్‌ను సన్మానిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటకృష్ణారెడ్డి

**ఉంగుటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్న ఎంపీడీవో ఈ.సత్యకుమార్‌కు వరుసగా మూడుసార్లు ఉత్తమ సేవా పురస్కారం లభించటం హర్షణీయమని టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఈ.సత్యకుమార్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా మండలంలో ఉత్తమ సేవా పురస్కారాలందుకున్న ఇందుపల్లి పశువైద్యాధికారి జి.సుధీర్ బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.పద్మాదేవి, తేలప్రోలు ఫీల్డ్ అసిస్టెంట్ జి.విజయకుమారికి ఆరుమళ్ల అభినందనలు తెలియజేశారు.

## బ్రాహ్మణ సేవాసంఘం నూతన కార్యవర్గం

**ఉయ్యూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** బ్రాహ్మణ సేవాసంఘం ఉయ్యూరు నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక విష్ణాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడి గా చోడవరపు బాపిరాజు, కార్యదర్శిగా గుడిపాటి ప్రభాకర శర్మ, కోశాధికారిగా కోడూరు కోదండరామశర్మ ఎన్నికయ్యారు.

## మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ రావటం సముచితం

**గన్నవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మ శ్రీ అవార్డును అందజేయటం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా మాదిగలకు గుర్తింపు తెచ్చిన వ్యక్తిని పేర్కొన్నారు.

# నాడు కళకళ.. నేడు వెలవెల

- కుదేలైన కొండపల్లి స్టేషన్ సెంటర్ వ్యాపారం
- ఎర్రబ్రిడ్జ్ ఎత్తుతో తెగిన సంబంధాలు
- ప్రయాణ సాధనాల కుదింపుతో తారుమారు
- వ్యాపారుల విలవిల, ప్రయాణికులకు కష్టాలు



కొండపల్లి రైల్వే స్టేషన్ సెంటర్

మనిషికి మనిషి, వాహనానికి వాహనం తప్పుకోలేనంత రద్దీతో నిత్యం ప్రయాణికులు, వినియోగదారులతో వాణిజ్యపరంగా ఒక వెలుగు వెలిగిన కొండపల్లి రైల్వే స్టేషన్ సెంటర్ ఇప్పుడు జన, వాహన సంచారం లేక వెలవెలబోతోంది. నేటి ఈ దుస్థితికి అనేక కారణాలున్నాయి. ముఖ్యంగా రాజకీయ కారణాలు రైల్వేస్టేషన్ అభివృద్ధికి అవరోధంగా మారాయి. ఇబ్రహీంపట్నం - ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారి 30పై ఎర్ర బ్రిడ్జి ఎత్తు పెంచి కొత్త వంతెన నిర్మించడంతో కొండపల్లి స్టేషన్ సెంటర్‌తో నేరుగా సంబంధం తెగిపోయింది. ప్రయాణ సాధనాలు ఎప్పుడైతే తగ్గిపోయాయో సెంటర్ అభివృద్ధి కూడా క్రమంగా పతనం కావడం మొదలైంది. కొండపల్లి స్టేషన్ సెంటర్ పూర్వ వైభవంగా మళ్లీ కన్నులారా చూస్తామా అన్న సందేహంలో ఈ ప్రాంత వాసులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. - ఇబ్రహీంపట్నం-ఆంధ్రజ్యోతి

కొండపల్లి అనగానే ఖిల్లా, కొయ్యబొమ్మలతో పాటు రైల్వేస్టేషన్ సెంటర్ కూడా కళ్లముందు కదలాడుతుంటాయి. అంతగా అవి పాపులర్ అయ్యా యి. ఒక విధంగా కొండపల్లికివే లాండ్‌మార్క్స్. పెద్ద ఎత్తున వస్త్ర వ్యాపా రం, ఇతర గృహోపకరణాలు, బంగారం వ్యాపారంతో మంచి వాణిజ్య కేం ద్రంగా కొండపల్లికి గుర్తింపు ఉంది. ఈ క్రమంలో సికింద్రాబాద్ నుంచి వి జయవాడ వరకు నడిచే రైళ్లలో తెలంగాణ రాష్ట్రం విడిపోక ముందు ఖ మ్మం, వరంగల్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు కొండపల్లి వచ్చి దు స్తులతో పాటు ఇతరత్రా వస్తువులు కొనుగోలు చేసుకొని వెళ్లేవారు. జి.కొండూరు మండలంతో పాటు ఇబ్రహీంపట్నం చుట్టుపక్కల మండలాల నుం చి కూడా అనేక మంది కొండపల్లికి వచ్చేవారు. ముఖ్యంగా ఖమ్మం, వరంగల్ జిల్లాల నుంచి ఉదయం వచ్చే ప్యాసింజర్ రైళ్లలో సుమారు 3వేల మంది కార్మికులు ఈ ప్రాంతానికి వచ్చి భవన నిర్మాణ, వ్యవసాయ ఇతర పనులు చేసుకొని తిరిగి సాయంత్రం రైలుకు తిరిగి వెళ్లేవారు. కొండపల్లి స్టేషన్ సెంటర్ నుంచి కంకిపాడు, గన్నవరంతో పాటు విజయవాడలోని అనేక ప్రాంతాలకు పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సులు 5 నిముషాలకు ఒకటి చొ ప్పున నడిచేవి. ఈ క్రమంలో రైల్వేస్టేషన్ సెంటర్‌లో అనేక హోటల్స్, ఇతర షాపులు నిత్యం రద్దీగా ఉండేవి. ఇప్పుడు పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా మారింది. జనం, వాహనాల సంచారం లేక సెంటర్ వెలవెలబోతోంది.

### స్టేషన్ సెంటర్‌తో తెగిన సంబంధం

కొండపల్లి రైల్వే స్టేషన్‌తో ఎన్.హెచ్ 30పై నిర్మించిన హైలెవల్ వంతెన దెబ్బకు స్టేషన్ సెంటర్ వ్యాపారం పూర్తిగా దెబ్బతింది. బస్సులు సంఖ్య తగ్గిపోవడం కూడా ఈ పరిస్థితికి ప్రధాన కారణం. ఒకప్పుడున్న ఎర్రబ్రిడ్జిపైకి స్టేషన్ సెంటర్ నుంచి నేరుగా ఎక్కే వీలుండేది. వంతెన హైట్ పెంచడంతో రోడ్డు పల్లంగా తయారైంది. దీంతో ఎన్‌హెచ్ నుంచి సుమారు 500 మీటర్ల ముందుకు వెళ్లి అక్కడి నుంచి కొండపల్లి స్టేషన్ సెంటర్‌కు వెళ్లాల్సి ఉంది. దూరం పెరిగిపోవడంతో ప్రయాణికులు సైతం ఆటోలు దొరక్క అవస్థలు పడుతున్నారు.



కొండపల్లి రైల్వేస్టేషన్ సెంటర్ ప్రాభవాన్ని కోల్పోవడానికి కారణమైన ఇబ్రహీంపట్నం - ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారి

### రాజకీయ నేతలేం చేస్తున్నట్టు..?

స్టేషన్ సెంటర్ దుస్థితికి రాజకీయ నేతలు కూడా ఒక కారణమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎర్ర బ్రిడ్జ్ ఎత్తు పెంచి స్టేషన్ సెంటర్‌కు ఎన్‌హెచ్ 30 నుంచి నేరుగా సంబంధం లేకుండా చేసినా ఒక్క నాయకుడు మాట్లాడలేదని, బస్సుల సంఖ్య తగ్గించినా మాట్లాడలేదని ఆరోపిస్తున్నారు. కొండపల్లి స్టేషన్‌ను అభివృద్ధి చేయకుండా రాయనపాడు రైల్వేస్టేషన్ అభివృద్ధి చేస్తున్నా నేతలు ఎందుకు మౌనంగా ఉన్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నేతలు ఐక్యమత్యంగా ఉండి కొండపల్లి స్టేషన్ సెంటర్‌కు పూర్వ వైభవం తీసుకురావాలనేది ప్రజల భావన.




### మహా కుంభమేళాకు
## ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

బస్టేషన్,జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళాకు వెళ్లే భక్తుల కోసం ఎన్టీఆర్ జిల్లా ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ప్రయాగ్ రాజ్‌తో పాటు అయోధ్య, కాశీ పుణ్యక్షేత్రాలను దర్శించుకునే అవకాశం ఉంటుందని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎంవై దానం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైటెక్ సూపర్ లగ్జరీ, స్టార్ లైనర్ (నాన్ ఏసీ స్లీపర్), వెన్నెల (ఏసీ స్లీపర్) బస్సులను నడపనున్నట్టు తెలిపారు. మొత్తం ప్రయాణం 8 రోజులుంటుందని, తొలిరోజు ఉదయం 11 గంటలకు పండిట్ నెహ్రూ బస్టేషన్ నుంచి బస్సు బయలుదేరుతుంది. రెండో రోజు సాయంత్రానికి ప్రయాగ్ రాజ్ చేరుకుంటారు. మూడోరోజు అక్కడే బస. నాలుగో రోజు రాత్రికి అయోధ్యకు బయలుదేరుతారు. ఐదో రోజు బాలరాముడిని దర్శించుకుంటారు. తిరిగి రాత్రికి వారణాశికి బయలుదేరుతారు. ఆరో రోజున వారణాశి చేరుకుని రాత్రికి అక్కడే బస చేస్తారు. ఏడో రోజు వారణాశి నుంచి బయలుదేరుతారు. ఎనిమిదో రోజు రాత్రికి విజయవాడ చేరుకుంటారు. హైటెక్ సూపర్ లగ్జరీ బస్సులో ఒకరికి రూ 8,000. స్టార్ లైనర్ ఏసీ స్లీపర్‌లో ఒకరికి రూ.11వేలు, వెన్నెల ఏసీ స్లీపర్‌లో రూ.14,500 చార్జి చెల్లించాల్సి ఉంటుంది. భోజనం, వసతి ఖర్చులు భక్తులు ఎవరికి వారే భరించుకోవాలి. 29 మంది గానీ, 35 మందిగానీ సమూహంగా వచ్చినట్టయితే బస్సు ఏర్పాటు చేస్తారు. ఆన్‌లైన్‌లోగానీ, ఏజెంట్ ద్వారా గానీ, పండిట్ నెహ్రూ బస్సు స్టేషన్‌లో గానీ టికెట్లు పొందవచ్చునన్నారు. వివరాలకు 8074298487కు ఫోన్ చేయవచ్చునన్నారు.

### ఉత్తరాఖండ్ హైకోర్టు
## ప్రధాన న్యాయమూర్తి విజయవాడ రాక

పెనమలూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జీ నరేందర్ సోమవారం కుటుంబసభ్యులతో కలిసి బెంగళూరు నుంచి విజయవాడ వచ్చారు. తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, బెంగళూరు పర్యటనలో భాగంగా ఆయన కుటుంబసభ్యులతో కలిసి వచ్చినట్టు ప్రభుత్వాధికారులు తెలిపారు. జస్టిస్ నరేందర్, కుటుంబసభ్యులకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షించారు.



అరుణా సుబ్బారావును సత్కరిస్తున్న హజరత్తయ్య గుప్తా తదితరులు

## జనరంజకంగా నాటకోత్సవాలు ప్రారంభం

విజయవాడ కల్చరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): 3 రోజులపాటు నిర్వహించే నాటకోత్సవాలు జనరంజకంగా ప్రారంభమవడం ముదావహమని, ప్రేక్షకాదరణ బాగుందని తపస్వి కల్చరల్ ఆర్ట్స్ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. తపస్వి కల్చరల్ ఆర్ట్స్, ఆంధ్ర నాటక కళాపరిషత్, కొడాలి బ్రదర్స్ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ నందమూరి తారక రామారావు కళాపరిషత్ 8 రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు సోమవారం హనుమంతరాయ గ్రంథాలయం కళావేదికపై ప్రారంభమయ్యాయి. నటుడు జయప్రకాశ్ రెడ్డి కుమార్తె మల్లికారెడ్డి పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు, అంబటి మధుమోహన్‌కృష్ణ, కామినేని పట్టాభిరామయ్య, దర్శకుడు డి.రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని తపస్వి కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు సూర్యదేవర జగన్నాథరావు పర్యవేక్షించగా, జానపద గాయని అరుణా సుబ్బారావును ఘనంగా సత్కరించారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు సత్యనారాయణరాజు, భాస్కర్‌రాజు, సూర్యనారాయణ రాజు తదితరులు

### కమర్షియల్ వెహికల్ అసోసియేషన్
## జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

సత్యనారాయణపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా కమర్షియల్ వెహికల్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక సోమవారం ఏకగ్రీవమైంది. రామకృష్ణాపురంలో సోమవారం కార్యవర్గసమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడిగా దెందుకూరి సత్యనారాయణరాజు, సెక్రటరీగా డీ భాస్కర్‌రాజు, కోశాధికారిగా డీ సూర్యనారాయణరాజు, గౌరవాధ్యక్షుడిగా పెనుమత్స అప్పలరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభులతో ఆయన ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షకార్యదర్శులు దెందుకూరి సత్యనారాయణరాజు, డీ భాస్కరరాజు మాట్లాడుతూ అసోసియేషన్ సమస్యలను పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, సభ్యులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం నూతన సభ్యులను, అసోసియేషన్ నేతలు, సభ్యులు, పెద్దలు పూలమాల జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.



కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలంటూ ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

## కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలి

- డీవైఎఫ్ఐ రాష్ట్ర నేతలు

ధర్నాచౌక్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రిలిమ్స్ పరీక్షల్లో అర్హత సాధించిన పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల న్యాయం చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వై.రాము, జి.రామన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అభ్యర్థులందరికీ ఫిజికల్ ఈవెంట్స్‌లో అవకాశం కల్పించాలన్నారు. వారికి న్యాయం చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక ధర్నాచౌక్‌లో సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. గత ప్రభుత్వం 2022 నవంబర్ 22న 6,100 కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయగా ప్రిలిమ్‌లో 95,208 మంది అర్హత సాధించారన్నారు. ఈలోగా ఎమ్మెల్సీ ఎన్నికలు, కోర్టు కేసుల కారణంగా రెండేళ్ల నుంచి ప్రభుత్వం వాయిదా వేస్తూ వచ్చిందన్నారు. ఇప్పుడు ఫిజికల్ ఈవెంట్స్‌కు వయస్సు సరిపోదని అభ్యర్థులను తిరస్కరిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు చేసిన నిర్లక్ష్యానికి అభ్యర్థులను బలి చేయడం సిగ్గుచేటన్నారు. పి.కృష్ణ, ఎన్.నాగేశ్వరరావు, రాజుకుమార్, రాజీవ్, అనిత, మల్లి పాల్గొన్నారు.

## రహదారి పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించం

- ఆర్ అండ్ బీ మంత్రి జనార్దనరెడ్డి

హనుమాన్‌జంక్షన్ రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారుల అభివృద్ధితో పాటు మరమ్మతుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆర్ అండ్ బీ మంత్రి జనార్దనరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరికీడు వద్ద ఎంఎన్‌కే రహదారి నుంచి వసంతవాడ, పెదపాడు మీదుగా ఏలూరు కలిసే ప్రధాన రహదారి పనులను సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పెరికీడు వద్ద ఎంఎన్‌కే రహదారిని కలిపే పాయింట్ వద్ద నిర్మాణం జరగడం లేదని స్థానిక టీడీపీ నేత, మాజీ జడ్పీటీసీ వేగిరెడ్డి పాపారావు మంత్రికి చూపించారు. 4ఏళ్ల క్రితం ప్రారంభించిన నిర్మాణ పనులు గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పాటు అధికారుల నిర్లిప్తత కారణంగా ఇప్పటికీ సాగుతోందని, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి నిర్మాణంలో కల్వర్టులను నీళ్లు లేనప్పుడు వేసుకోవాలని, అప్పుడు ఎందుకు వేయలేదని ఎమ్మెల్యే చింతమనేని ప్రశ్నించారు. దీనిపై మంత్రి జనార్దనరెడ్డి అధికారులను వివరణ కోరగా దుకాణదారులు కోర్టుకు వెళ్లారని సమాధానమిచ్చారు. అధికారుల సమాచారం తప్పని, వారు కోర్టుకు వెళ్లలేదని స్థానికులు అక్కడే ఖండించడంతో మంత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారి ప్రారంభ పాయింట్ నుంచి వేయాలని, కల్వర్టుల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని సూచిస్తూ మళ్లీ పరిశీలనకు వస్తానని మంత్రి అధికారులను హెచ్చరించారు. టీడీపీ నేతలు బండారు సత్యన్నారాయణ, ఆరేపల్లి సుబ్బారావు, వడ్డి వాసవి, తాడి రంగారావు, జనసేన వీర మహిళ లక్ష్మీప్రసన్న, గరికపాటి చంటి స్థానికులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దనరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, కూటమి నేతలు వేగిరెడ్డి, లక్ష్మీప్రసన్న

### రేపు చేతి వృత్తి కళాకారులకు రుణమేళా

ఆటోనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద దరఖాస్తు చేసి 5 రోజుల ప్రాథమిక శిక్షణ పొందిన చేతివృత్తి కళాకారులకు 29న రుణ సదుపాయం కల్పిస్తున్నట్టు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత పొందిన చేతివృత్తి కళాకారులు సంబంధిత పత్రాలతో ఆటోనగర్‌లోని ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ హాలో నిర్వహించే రుణమేళాకు హాజరు కావాలన్నారు. వివరాలకు 87902 65577ను సంప్రదించాలని కోరారు.



రాజమండ్రి, కాకినాడ సోనోవిజన్‌లో లక్కీ డ్రా తీస్తున్న గోరంట్ల బుచ్చయ్య చౌదరి, చిత్రంలో సోనోవిజన్ మేనేజింగ్ పార్టనర్ భాస్కరమూర్తి

## సోనోవిజన్ లక్కీడ్రాలో విజేతకు ఆల్టోకారు

- ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు అందజేసిన నిర్వాహకులు

వన్‌టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి, కాకినాడ సోనోవిజన్‌లో గత ఏడాది కొనుగోలుదారులకు సోమవారం రాజమండ్రి జేఎన్ రోడ్డులోని షోరూమ్‌లో విజేతలకు ఆల్టో కారు, ఎల్ఈడీ టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషిన్‌లు బహుమతులుగా అందజేశారు. రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ముఖ్య అతిథిగా విచ్చేసి వందలాది మంది కొనుగోలుదారుల సమక్షంలో డ్రా తీశారు. 017607 నెంబరు కూపన్... కొనుగోలుదారు కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన ఎస్ అన్నపూర్ణకు ఆల్టో కారు, 03376 నెంబరు కూపన్.. కొనుగోలుదారు రాజమండ్రికి చెందిన కే చైతన్యకు ఎల్ఈడీ టీవీ, 84452 నెంబరు కూపన్... కొనుగోలుదారు రాజమండ్రి ఇన్నీస్‌పేటకు చెందిన అఖిల్ కుమార్‌కు రిఫ్రిజిరేటర్, 017647 నెంబరు కూపన్.. కొనుగోలుదారు కాకినాడకు చెందిన అల్లం కుమార్‌కు వాషింగ్ మెషిన్ బహుమతులుగా వచ్చాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ అందరికన్నా తక్కువ ధరలు, నమ్మకమైన సేవ, రాష్ట్రంలో అతిపెద్ద ఎలక్ట్రానిక్ చైన్‌స్టోర్ సోనోవిజన్‌లో రిపబ్లిక్ డే సందర్భంగా రాయితీ ధరల్లో వడ్డీగానీ, డీబీడీ గానీ లేకుండా లభించే ఫైనాన్స్ సౌకర్యం లాభదాయకంగా ఉంటుందన్నారు. అన్ని పెద్ద కంపెనీల నుంచి ఎల్ఈడీ, వాషింగ్ మెషిన్లు, రిఫ్రిజిరేటర్లు, ఏసీ, మొబైళ్లు, ల్యాప్‌టాప్‌లు, గృహోపకరణాలు అందరికన్నా తక్కువ ధరల్లో లభిస్తాయన్నారు. ముఖ్యంగా ఈఎంఐ, ఫైనాన్స్ కొనుగోలుపై రూ.26 వేలు వరకు 22.5 శాతం వరకు క్యాష్‌బ్యాక్ లభించడంతో కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. నమ్మకమైన సేవలందిస్తామని షోరూం తరపున వినియోగదారులను ఆహ్వానిస్తున్నట్టు మేనేజింగ్ పార్టనర్ పీ భాస్కరమూర్తి తెలిపారు.

## బకాయి వేతనాలు విడుదల చేయాలి

- వీవోఏ ఉద్యోగుల సంఘం, సీఐటీయూ

కృష్ణలంక, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలల బకాయి వేతనాలు విడుదల చేయాలని, కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ ఎన్టీఆర్ జిల్లా వెలుగు యానిమేటర్స్ (వీవోఏ) ఉద్యోగుల సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈసందర్భంగా వీవోఏ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు ఏ కమల మాట్లాడుతూ వెలుగు డిపార్ట్‌మెంట్ (డీఆర్‌డీఏ)లో పనిచేస్తున్న డ్వాక్రా వీవోఏలు వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 27, 28, 29 తేదీల్లో అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద నిరసన దీక్షలు చేస్తున్నారన్నారు. మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ వీవోఏల మెడకు ఉరితాడులా మారిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 28వేల మంది వీవోఏలు పొదుపు సంఘాల మహిళలకు దీర్ఘకాలికంగా సేవలందిస్తూ పేద మహిళలను కూడగట్టడంలో, బ్యాంకుల లావాదేవీల్లో, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో పేద మహిళలను కూడగట్టి కొత్త గ్రూపులను ఏర్పాటు చేయడంలో వీవోఏలు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. అలాంటి వారికి ఈ సర్క్యులర్ అమలుతో వారి కుటుంబాలు రోడ్డునపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల ఉమాదేవి, టి.విజయలక్ష్మి, వి.సౌజన్యకుమారి, బి.ప్రగతి, ఎల్.స్వాతి, టి.అనిత, ఎల్.వెంకట్రావు, పి.వెంకటేష్, డి.కుమారి భాయ్ తదితరులు పాల్గొన్నారు.




కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వెలుగు యానిమేటర్స్ ఉద్యోగులు

## జిల్లాస్థాయి కబడ్డీ విజేత డీసీ యూత్

- రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి

తోట్లవల్లూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికితీసేందుకు కబడ్డీ పోటీలను నిర్వహించటం అభినందనీయమని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి అన్నారు. మండలంలోని గరికపర్రు ఉత్తర దళితవాడలో జరిగిన కృష్ణాజిల్లా స్థాయి కబడ్డీ లీగ్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో దండమూడి చౌదరి (డీసీ యూత్) జట్టు ప్రథమ స్థానంలో నిలవగా ద్వితీయ స్థానంలో వల్లూరుపాలెం, తృతీయ స్థానంలో మేడూరు జట్లు నిలిచాయి. ప్రథమ బహుమతిని పొందిన డీసీ యూత్ జట్టుకు ఉండవల్లి శ్రీదేవి చేతుల మీదుగా ట్రోఫీ ప్రదానం చేశారు. హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్, మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ బిరుదులను కేంద్రప్రభుత్వం ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ శ్రీదేవి కేక్‌ను కట్ చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు నర్రా వెంకట అప్పారావు, గూడపాటి గిరిబాబు, ఉయ్యూరు శివనాగరాజు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీల్లో విజేత డీసీ యూత్ జట్టుకు ట్రోఫీని ప్రదానం చేస్తున్న రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి

## మత్స్యశాఖ కమిషనర్‌గా రామశంకర్ నాయక్

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్‌గా 1997 బ్యాచ్ విశ్రాంత ఐఏఎస్ అధికారి రామశంకర్ నాయక్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గత టీడీపీ ప్రభుత్వంలో ఆయన మత్స్యశాఖ కమిషనర్‌గా పని చేశారు. మరోసారి ఆయనకు అవకాశం కల్పించారు. 2018 ఏప్రిల్‌లో చివరి సారిగా తీసుకున్న జీతంలో ఇప్పుడు తీసుకుంటున్న పెన్షన్ మొత్తాన్ని తగ్గించి, మిగతా మొత్తాన్ని ఆయనకు జీతంగా నిర్ణయించనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మొన్నటి వరకూ డిప్యుటేషన్‌పై మత్స్యశాఖ కమిషనర్‌గా వ్యవహరించిన ఐఎఫ్ఎస్ అధికారి డోలా శంకర్‌ను మాతృశాఖకు పంపించారు.

## సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ డైరెక్టర్‌గా సతీశ్

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఏపీ సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ డైరెక్టర్‌గా డాక్టర్ యడ్లపల్లి సతీశ్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సీడ్స్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన అభ్యర్థన మేరకు ఏడాది పాటు డిప్యుటేషన్‌పై సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ(ఏపీఎస్‌సీఏ) డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఏపీఎస్‌సీఏ డైరెక్టర్‌గా ఉన్న జీ వినయ్‌చంద్ ఏపీ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ డైరెక్టర్‌గా కొనసాగనున్నారు. స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ ఏ చంద్రిక డిప్యుటేషన్‌పై గుంటూరు(మిర్చి) మార్కెట్ యార్డు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీగా నియమితులయ్యారు.

### పెండింగ్‌లో ఉన్న 3వేల మందికి
## పదోన్నతులు ఇవ్వండి

బస్టేషన్,జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణా సంస్థ (ఆర్టీసీ)లో పెండింగులో ఉన్న 3వేల మందికి పదోన్నతులు వెంటనే ఇవ్వాలని సంస్థ వైస్ చైర్మన్ మునిరత్నంకు ఎంప్లాయీస్ యూనియన్ నేతలు విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ హౌస్‌లో సోమవారం మునిరత్నంను కలిసిన నేతలు ఆయనకు మర్యాదపూర్వకంగా దుశ్శాలువ కప్పి పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం నేతలు మాట్లాడుతూ ప్రభుత్వంతో చర్చించి వెంటనే పదోన్నతులకు అనుమతులిచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వంలో సంస్థ విలీనం అయ్యాక వచ్చిన నిబంధనలతో పదోన్నతులు ఆగిపోయాయని, నాలుగో తరగతి ఉద్యోగి నుంచి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల స్థాయి వరకు పదోన్నతులు ఆగిపోయాయన్నారు. ఇందుకు సంబంధించిన ఫైళ్ల కదలిక పూర్వాపరాలను నేతలు వివరించారు. ఆర్టీసీ ఉద్యోగులకు పాత విధానంలోనే వైద్య సౌకర్యాలు అందచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల భద్రతకు 2019లో ఇచ్చిన జీవో-1ను అమలు చేయాలని, ఖాళీగా ఉన్న 10వేల ఉద్యోగాల భర్తీకి చొరవ తీసుకోవాలని కోరారు. పెండింగులోని 2017 పీఆర్‌సీ బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జీవీ నర్సయ్య, నేతలు ఎండీపీ సిద్దిక్, మందపాటి శంకరరావు, జీఎస్ నారాయణ, ఏఆర్ సీహెచ్ రెడ్డి పాల్గొన్నారు.



ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నంను సత్కరిస్తున్న ఈయూ నేతలు పలిశెట్టి, జీవీ

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్‌బర్డ్ | 130, 139, 150 |
| చికెన్ విత్ స్కిన్ | 250 |
| చికెన్ స్కిన్‌లెస్ | 260 |

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 480

## వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

**గుడివాడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి):** వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కామినేని సూపర్ స్పెషాలిటీ వైద్య బృందంతో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని సోమవారం నిర్వహించారు. శిబిరాన్ని అర్బన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జీ) ప్రారంభించారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్, హైదరాబాద్ సహకారంతో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశారు. వాకర్స్ క్లబ్ సభ్యులు లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు, సనకా సుబ్బారావు, ఎంసీ నారాయణరెడ్డి, లింగం జానకిరాంప్రసాద్, సూరపనేని రామ్మోహన్, మండలపు నాగేశ్వరరావు, లింగం బాబ్జీ, గుత్తా చంటి పాల్గొన్నారు.

## ఉపాధి పనులు ప్రారంభం

**తోట్లవల్లూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):** బొడ్డపాడులో ఉపాధి హామీ పనులను సోమవారం సర్పంచ్ మూడే శివశంకర్ భూమిపూజ చేసి ప్రారంభించారు. పంటబోదెల తవ్వకం పనులు చేపట్టామని ఆయన తెలిపారు. ఉపసర్పంచ్ కె.శివశంకర్, ఫీల్డు అసిస్టెంట్ పి.సాంబయ్య, మాజీ సర్పంచ్ ఎన్.సీతారాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## యువగళంతో రాక్షసపాలన అంతం

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

**పామర్రు, జనవరి 27(ఆంధ్రజ్యోతి):** 'మంత్రి నారా లోకేశ్ చేసిన యువగళం పాదయాత్ర రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ రాక్షస పాలన నుంచి ప్రజలను విముక్తుల్ని చేసింది. ప్రజల కష్టాలు, కన్నీళ్లు తుడుస్తూ కొనసాగిన పాదయాత్ర రాష్ట్ర ప్రజల్లో ఓ భరోసా నింపింది. ఎన్నికల్లో వైసీపీ రాక్షస ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకలించింది. ప్రజా ప్రభుత్వ ఏర్పాటులో ప్రధాన భూమిక పోషించింది.' అని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. టీడీపీ కష్టకాలంలో పార్టీ క్యాడర్‌కు అండగా నిలిచేందుకు, రాష్ట్ర ప్రజలశ్రేయస్సు కోసం చేసిన పాదయాత్ర ప్రారంభించి నేటికి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. నాటి జగన్ ప్రభుత్వం పాదయాత్రకు ఎన్ని అడ్డంకులు సృష్టించినప్పటికీ వెనుకంజ వేయకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి 11 జిల్లాల్లో 97 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 226 రోజులపాటు 3,132 కిలోమీటర్ల మేర యువగళం సాగిందన్నారు. ఇటీవల నిర్వహించిన లోకేశ్ దావోస్ పర్యటన తోనూ రాష్ట్రానికి ఎంతో మేలు జరగబోతుందన్నారు.

### లోకేశ్ పాదయాత్రతో రాష్ట్ర రాజకీయాల్లో
## సరికొత్త అధ్యాయం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

**గుడివాడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి):** యువగళం పాదయాత్రతో రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త అధ్యాయాన్ని మంత్రి నారా లోకేశ్ లిఖించారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం ప్రజావేదికలో ఆయన విలేకరులతో మాట్లాడారు. యువగళం పాదయాత్ర ప్రారంభించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా లోకేశ్‌కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల కష్టాలను వింటూ, కన్నీళ్లు తుడుస్తూ 97 అసెంబ్లీ నియోజకవర్గాల్లో యువగళం పాదయాత్ర సాగిందని, అందులో 90చోట్ల కూటమి అభ్యర్థులు ఘనవిజయం సాధించారని ఆయన అన్నారు. లోకేశ్ స్ఫూర్తితోనే రాజకీయంగా ముందుకు వెళుతున్నానని తెలిపారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రాజశేఖర్

### సాంస్కృతిక పోటీల్లో గుడ్లవల్లేరు
## పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

**గుడ్లవల్లేరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి):** ఎ.ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థులు సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచారని పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రాజశేఖర్ తెలిపారు. తేలప్రోలు ఉషారామా కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో నిర్వహించిన యువర్ ఫెస్ట్-2025లో సాంస్కృతిక పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులను కైవశం చేసుకున్నారని ఆయన తెలిపారు. విజేతలను యాజమాన్యం, బ్రాంచ్ హెచ్‌వోడీలు అభినందించారు.



మల్లాయపాలెం సచివాలయంలో
ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

## అంగన్వాడీ చిన్నారులకు ఆధార్ నమోదు

**గుడివాడ రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి):** అంగన్వాడీ పిల్లలకు మల్లాయపాలెం సచివాలయంలో ఆధార్ నమోదు చేస్తామని ఐసీడీఎస్ అధికారి విజయ ఫ్లోరెన్స్ తెలిపారు. మల్లాయిపాలెం సచివాలయంలో 0-6 సంవత్సరాల పిల్లలకు ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని సోమవారం సీడీపీవో పరిశీలించారు. గుడివాడ డివిజన్‌లోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ఆధార్ నమోదు చేయిస్తామని ఆమె తెలిపారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో దగ్గరుండి ఆధార్ నమోదు చేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కార్యకర్తలు బాధ్యత తీసుకుని తల్లిదండ్రులకు ఆధార్ ప్రయోజనాలు వివరించి నమోదు చేయించాలని ఆమె సూచించారు. సూపర్‌వైజర్ నదీరున్నీసా, అంగన్వాడీ కార్యకర్తలు ఝాన్సీరాణి, జయప్రద, శ్రీలత, పద్మజ, వరలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా కాజ బెయిలీ బ్రిడ్జి



ప్లాట్‌ఫాం రేకులు విరిగిపోయి శిథిలావస్థకు చేరిన వంతెన



**(ఆంధ్రజ్యోతి-కూచిపూడి):** కాజలో ఐనంపూడి డ్రెయిన్‌పై పదిహేనేళ్ల క్రితం నిర్మించిన తాత్కాలిక ఇనుప వంతెన(బెయిలీ బ్రిడ్జి) శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉంది. ప్లాట్‌ఫాం రేకులు విరిగిపోయి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మొవ్వ నుంచి మచిలీపట్నం వెళ్లేందుకు ఇది ప్రధాన రహదారి. ఈ ప్రాంత ప్రజలు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ప్రయోజనం కనిపించలేదు. తేలికపాటి వాహనాల రాకపోకలకే వంతెన ఊగిపోతోంది. ప్లాట్‌ఫాంపై ఉన్న ఇనుప రేకులు పగిలిపోయి శిథిలావస్థకు చేరాయి. శాశ్వత వంతెన నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న ఏడీఏ రమాదేవి

**గుడివాడ రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి):** గుడివాడ డివిజన్‌లోని ఎరువుల షాపుల యజమానులందరూ కంపెనీ పేరు, తేదీ ముద్రించి ఉన్న పురుగు మందులనే రైతులకు విక్రయించాలని ఏడీఏ ఎన్.రమాదేవి ఆదేశించారు. సోమవారం బంటుమిల్లి రోడ్డులోని ఎరువుల షాపును ఆమె తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ప్రతి కొనుగోలుకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. మినుము పూత దశలో ఉందని, రైతులకు ప్రభుత్వ అనుమతులున్న పురుగుమందులే విక్రయించాలని, అనుమతి లేని పురుగుమందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎరువుల దుకాణాల యజమానులను ఏడీఏ హెచ్చరించారు. కొంతమంది రైతులు రెండు, మూడు రకాల పురుగుమందులు కలిపి పిచికారీ చేస్తున్నారని, మినుము పైరుపై దుష్ప్రభావం చూపుతుందని, రైతులకు వివరించాలని సూచించారు. ఏవో బి.అనంతలక్ష్మి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## సంపూర్ణ అక్షరాస్యత సాధిద్దాం

**పామర్రు, జనవరి 27(ఆంధ్రజ్యోతి):** గ్రామీణుల్లో నిరక్షరాస్యతను పారదోలి సంపూర్ణ అక్షరాస్యత సాధనలో డ్వాక్రా సంఘాల బుక్‌కీపర్లు భాగస్వాములవ్వాలని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. ఎంపీపీ కార్యాలయంలో సోమవారం డ్వాక్రాసంఘాల బుక్‌కీపర్లతో సంపూర్ణ అక్షర్యానత సాధనలో బుక్‌కీపర్ల పాత్ర అనే అంశంపై శిక్షణ, సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం సరఫరా చేసిన అక్షర వెలుగు పుస్తకాలను అందజేశారు. ఎంపీడీవో కె.జ్యోతి వెలుగు ఏపీఎం తిరుపతిరావు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డు చైర్మన్ పదవి కేటాయించండి



మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందిస్తున్న బొడ్డు శివశ్రీ, నారాయణ

**గుడివాడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి):** గుడివాడ మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవిని బీసీలైన తమకు కేటాయించాలని మాజీ కౌన్సిలర్ బొడ్డు శివశ్రీ, నారాయణ దంపతులు కోరారు. సోమవారం విజయవాడలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి వారు వినతిపత్రం అందజేశారు.

## పరిశోధనాత్మక విద్యతో ప్రయోజనాలెన్నో



జ్యోతిప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న వీసీ సాంబశివరావు

**గుడ్లవల్లేరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి):** 'ఫార్మసీ రంగంలో రాణించాలంటే నిత్యం నూతన విషయాలను తెలుసుకోవాలి. ఫార్మసీ విద్యార్థులు పరిశోధనాత్మకంగా విద్యనభ్యసిస్తేనే ప్రయోజనం. నిత్యం ప్రబలుతున్న వ్యాధుల నివారణకు నూతన ఔషధాల అవసరం ఉంది. ఔషధాల రూపకల్పనలో ఫార్మసిస్ట్ పాత్ర కీలకం.' అని మధ్యప్రదేశ్‌కు చెందిన జబల్పూర్ మాంగల్యతాన్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ కె.ఆర్.ఎస్ సాంబశివరావు సూచించారు. బయోటెక్నాలజీ బ్రేక్‌త్రూస్ రీ డిఫైనింగ్ ఫార్మసీ త్రూ కటింగ్ ఎడ్జ్ రీసెర్చ్ అనే అంశంపై సోమవారం వి.వి.ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో అసోసియేషన్ ఆఫ్ బయోటెక్నాలజీ నిర్వహిస్తున్న జాతీయ సదస్సులో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. డీఎస్ఏ మైక్రో ఎరే టెక్నాలజీ అండ్ ఇట్స్ సిగ్నిఫికెన్స్ ఇన్ డ్రగ్ డవలెప్మెంట్ అనే అంశంపై ఆయన ఉపన్యసించారు. డాక్టర్ కె.సోమశేఖర్, డాక్టర్ జి.చంద్రయ్య సదస్సులో ప్రసంగించారు. నాగార్జున విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.సుధాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, సదస్సు కో-ఆర్డినేటర్ ఎ.సాయిధాత్రి, డాక్టర్ ఎస్కే అమీరాబీ, డాక్టర్ పి.రవీష, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ టి.ప్రశాంతి, బి.సత్యశ్రీ పాల్గొన్నారు.

### భక్తితత్వం, సమానత్వాల
## సమ్మిళతమే అముక్తమాల్యద

**గుడివాడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి):** భక్తితత్వం సమానత్వ భావనలను సమాజానికి ప్రబోధించిన విశిష్ట ప్రబంధమే శ్రీకృష్ణదేవరాయలు రచించిన అముక్త మాల్యాద అని విజయవాడ వీబీ సిద్ధార్థ కళాశాల తెలుగు ఆచార్యుడు డాక్టర్ సత్య శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఎన్జీవోస్ హోంలో భారతీయ సమితి అధ్వర్యంలో అముక్త మాల్యాద- సాహితీ విలువలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సత్య శ్రీనివాస్‌ను సత్కరించారు. సమితి అధ్యక్ష, కార్యదర్శులు డీఆర్బీ ప్రసాద్, మోకా మాధవరావు, విశ్రాంత ఎంపీడీవో కంచనపల్లి కృష్ణమోహన్, ఎన్జీవోస్ తాలుకా యూనిట్ కార్యదర్శి జి.రాజేంద్రప్రసాద్, భారతీ సమితి సభ్యులు పాల్గొన్నారు.

## ఉత్తమ అధికారులకు అభినందన



ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యంను అభినందిస్తున్న మున్సిపల్ దుకాణాల లీజుదారుల అసోసియేషన్ నాయకులు



పశుసంవర్ధక శాఖ గుడ్లవల్లేరు డివిజన్ అధికారులను అభినందిస్తున్న ఉప సంచాలకుడు శ్రీనివాస్

**గుడివాడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి):** విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించినందుకు మచిలీపట్నంలో ఆదివారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ డీకే బాలాజీ నుంచి ఆర్డీవో, మున్సిపల్ ప్రత్యేకాధికారి జి.బాలసుబ్రహ్మణ్యం ఉత్తమ ఆర్డీవో అవార్డునందుకోవడం అభినందనీయమని మున్సిపల్ దుకాణాల లీజుదారుల అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో బాలసుబ్రహ్మణ్యంను వారు సత్కరించి, అభినందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కె.డి.వి.ఎన్.శ్రీనివాస్, సయ్యద్ గఫార్, కొత్త సుబ్బారావు పాల్గొన్నారు.

**పశుసంవర్ధకశాఖ అధికారులకు..**

**గుడ్లవల్లేరు:** గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ డీకే బాలాజీ నుంచి అవార్డులు అందుకున్న పశుసంవర్ధకశాఖ గుడ్లవల్లేరు డివిజన్ అధికారులను సోమవారం తన కార్యాలయంలో గుడ్లవల్లేరు ఉపసంచాలకుడు సి.శ్రీనివాస్ అభినందించారు. సహాయ సంచాలకుడు డాక్టర్ ఎం.జగన్నాథరావు, కౌతవరం పశుగణన కేంద్రం సీవీఎల్వో ఎస్.ప్రభాకరరావు, గుడ్లవల్లేరు ఉపసంచాలకుల కేంద్రం సీనియర్ అసిస్టెంట్ కె.వెంకటేశ్వరరావు అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకుడు డాక్టర్ సి.శ్రీనివాస్, సహాయ సంచాలకుడు డాక్టర్ ఎ.లక్ష్మీనారాయణ, డాక్టర్ వి.హనుమంతరావు పాల్గొన్నారు.

## బిళ్లపాడు కార్యదర్శికి సత్కారం



బిళ్లపాడు కార్యదర్శి హరికృష్ణను సత్కరిస్తున్న ఎంపీడీవో డి.వై.విష్ణుప్రసాద్, డీఎల్పీవో సంపతకుమారి

**గుడివాడ రూరల్:** జిల్లా ఉత్తమ కార్యదర్శిగా కలెక్టర్ బాలాజీ నుంచి అవార్డు అందుకున్న బిళ్లపాడు పంచాయతీ కార్యదర్శి వి.హరికృష్ణను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డి.వై.విష్ణుప్రసాద్, డీఎల్పీవో సంపత కుమారి సత్కరించారు. కార్యదర్శులు, పంచాయతీరాజ్, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించండి



ఇంజనీరింగ్ అసిస్టెంట్ పూర్ణకు వినతిపత్రం అందజేస్తున్న నిడుమోలు గ్రామస్తులు

**కూచిపూడి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):** నిడుమోలు గ్రామ పంచాయతీలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నేతలు, గ్రామస్థులు నిడుమోలు సచివాలయంలో సోమవారం అర్జీని అందజేశారు. 'గ్రామంలోని దేవుడి మాన్యానికి వెళ్లే రహదారి, అంతర్గత రహదారులు అభివృద్ధి పర్చాలి. రైతుబజార్ ఏర్పాటు చేయాలి. జగనన్న కాలనీలో రోడ్లు, మంచినీటి కుళాయిలు, డ్రెయినేజీలు, విద్యుత్ సౌకర్యం కల్పించాలి. జాతీయ రహదారుల సర్వీసు రోడ్డు నిర్మించాలి. జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద డివైడర్ ఏర్పాటు చేయాలి.' అని ఇంజనీరింగ్ అసిస్టెంట్ పూర్ణకు వినతిపత్రం అందించారు. ఉప్పలపాటి వెంకటాద్రి, మద్దుల బసవయ్య, పామర్తి శ్రీనివాసరావు, డొక్కు రాజ్యలక్ష్మి, జయలక్ష్మి, రేష్మి, పామర్తి ధనలక్ష్మి పాల్గొన్నారు.

## సైలెన్సర్ తీసి బుల్లెట్ నడుపుతున్న వ్యక్తిపై కేసు

**గుడివాడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి):** పట్టణంలో స్పోర్ట్స్ బైక్‌లతో రేసింగ్‌లు జరిపినా, సైలెన్సర్ తీసేసి వాహనాలు నడిపినా కేసులు నమోదు చేస్తామని వన్‌టౌన్ సీఐ కె.శ్రీనివాస్ హెచ్చరించారు. బుల్లెట్ సైలెన్సర్ తీసేసి షార్ట్స్ కొడుతూ, అధిక శబ్దాలు చేస్తూ ప్రజలను భయపెడుతున్న పట్టణానికి చెందిన వంశీపై కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు. సోమవారం డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని ఆయన తెలిపారు.

## ఘనంగా ఎలక్ట్రీషియన్ డే



ప్రైవేట్ ఎలక్ట్రికల్ ఉద్యోగులకు జ్ఞాపికలు అందజేస్తున్న యలవర్తి శ్రీనివాసరావు

**గుడివాడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి):** ది గుడివాడ తాలుకా ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్ డేను సోమవారం ఎన్జీవోస్ హోంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు విచ్చేశారు. కలిసికట్టుగా ఉండి ఎలక్ట్రీషియన్లు హక్కులు సాధించుకోవాలని అన్నారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



## కృష్ణమాదిగకు పద్మశ్రీ సముచితం



గుడివాడలో హర్షం వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**గుడివాడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి):** మాదిగల అభ్యున్నతి కోసం అహర్నిశలు పనిచేసిన మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ ప్రకటించడం సముచితమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల సుధాకర్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కృష్ణమాదిగకు పద్మశ్రీ రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇంటూరి గజేంద్ర, అద్దంకి కమల్, కొడాలి బాలు, ఇనంపూడి సురేష్, పసలాది శేఖర్, పసలాది సుధాకర్, బాబురావు, కలపాల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

**మోదీకి కృతజ్ఞతలు**

**తోట్లవల్లూరు:** మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ ప్రకటించడంపై వల్లూరుపాలెంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దళితులు ప్రధాన మంత్రి మోదీకి, ఎన్డీయే ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. బీసీ నాయకుడు కొనకాల వాసు, వల్లభాపురపు జగదీష్, జుజ్జువరపు శాంసోన్, జోజి బాబు పాల్గొన్నారు.



వల్లూరుపాలెంలో కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దళితులు

## మీకోసం అర్జీల పరిష్కారానికి కృషి



అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకోటేశ్వరరావు

**గుడివాడ రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):** మీకోసంలో వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖలకు పంపి, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తహసీల్దార్ వి. రామకోటేశ్వరరావు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. మండలంలో రెవెన్యూకు సంబంధించిన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. భూ, ఇతర ఏ సమస్యనైనా అధికారులు తెస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అట్లూరి వెంకటేశ్వరరావు, ఏవో బి.అనంతలక్ష్మి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, వెలుగు, ఐసీడీఎస్, ఇరిగేషన్, డ్రెయినేజీ, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

### మొవ్వలో మూడు అర్జీలు



అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ కె.మస్తాన్

**కూచిపూడి:** మొవ్వ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ప్రజల నుంచి మూడు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ కె.మస్తాన్ తెలిపారు. పెదపూడి, మొవ్వ గ్రామాల నుంచి నివేశన స్థలాల కోసం అర్జీలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పరమాత్మ, ఏవో శివప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జంట హత్యల కేసు కొట్టివేత

మచిలీపట్నం టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అమృతపురంలో 2011 నవంబరు 8న జరిగిన వేముల కనకబాబు, నిమ్మగడ్డ ప్రసాద్ (జంట) హత్యల కేసును సోమవారం కొట్టివేశారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన మీదట నిందితుడు గంజాల నాగరాజు మరో ఏడుగురిపై బనాయించిన హత్య కేసును అదనపు జిల్లా జడ్జి చినబాబు కొట్టి వేస్తూ తీర్పు చెప్పారు. నిందితుల తరపున సోడిశెట్టి బాలాజీ వాదించారు.



పారిశుధ్యం మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, చిత్రంలో కమిషనర్ బాపిరాజు

## బందరులో కలెక్టర్ బాలాజీ పర్యటన

మచిలీపట్నం టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ మచిలీపట్నంలో సోమవారం పర్యటించారు. బస్టాండ్, పోర్టురోడ్డు, రైల్వేస్టేషన్, బేబీసెంటర్, కూరగాయల మార్కెట్‌లలో పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. మునిసిపల్ అధికారులు, పారిశుధ్య కార్మికులకు సూచనలు ఇచ్చారు. మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, కార్పొరేటర్ మరకాని సమతాకీర్తి, మార్కెటింగ్ శాఖ ఏడీ నిత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబానికి ప్రమాద బీమా చెక్కు అందజేస్తున్న ఎంపీ వల్లభనేని బాలశౌరి

## జనసేన కార్యకర్తకు ప్రమాద బీమా చెక్కు

నాగాయలంక, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంక మండలం రేమాలవారిపాలెంలో జనసేన పార్టీ కార్యకర్త కుటుంబానికి ఎంపీ వల్లభనేని బాలశౌరి రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. గ్రామానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు మత్తి మురళీ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సోమవారం అతని కుటుంబాన్ని ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరామర్శించి, ప్రమాద బీమా పరిహారం చెక్కును అందజేశారు.




తహసీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న సీపీఐ నేత మోదుమూడి రామారావు

## పేదల ఇంటి కల నెరవేర్చాలి

మచిలీపట్నం టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ వాగ్దానం మేరకు పేదల ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ నేత మోదుమూడి రామారావు డిమాండ్ చేశారు. సోమవారం మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇళ్లస్థలాల కోసం వచ్చిన అర్జీలను తహసీల్దార్ నాగభూషణానికి అందజేశారు. మోదుమూడి రామారావు, లింగం ఫిలిప్‌లు మాట్లాడారు. పేదల సొంత ఇంటి కల నిజం కావాలన్నారు. సీపీఐ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా నిర్వహించారు. పి. దుర్గాభవానీ, వడుగు చైతన్య కుమార్, వడుగు రత్న కుమారి, పి. లక్ష్మణరావు, యర్రంశెట్టి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## భువనేశ్వరిని కలిసిన టీడీపీ నాయకులు



అవనిగడ్డ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి ఎన్టీఆర్ మోడల్ స్కూల్ సందర్శనకు వచ్చిన ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరిని నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు నేతృత్వంలో పలువురు ముఖ్యులు కలిశారు. పారిశ్రామికవేత్త, నియోజకవర్గ టీడీపీ నాయకులు బొబ్బా గోవర్ధన్, పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాస్, చల్లపల్లి మండలానికి చెందిన పలువురు టీడీపీ నేతలు భువనేశ్వరిని కలసి ఎన్టీఆర్ మోడల్ స్కూల్ ద్వారా పేద ప్రజలకు విద్యాబోధన చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కనపర్తి శ్రీనివాసరావు పార్టీ కార్యకలాపాలను ఆమెకు వివరించారు.



మోపిదేవిలో ఎస్.ఆర్ శంకరన్ రీసోర్స్ సెంటర్‌ను పరిశీలిస్తున్న మండలి బుద్ధప్రసాద్, జల్లి విల్సన్



వక్కలగడ్డలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులు అర్పిస్తున్న నేతలు

# శంకరన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

మోపిదేవి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎస్.ఆర్.శంకరన్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎస్.ఆర్.శంకరన్ మెమోరియల్ ట్రస్ట్ కన్వీనర్, శాసనమండలి మాజీ సభ్యులు జల్లి విల్సన్ అన్నారు. మోపిదేవిలోని బీసీ మత్స్యకారుల ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎస్.ఆర్. శంకరన్ రీసోర్స్ సెంటర్‌ను ట్రస్ట్ సభ్యులు, వివిధ సంఘాల ప్రతినిధులు సందర్శించారు. దళిత జాతి అభ్యున్నతికి విశేష కృషి చేసిన శంకరన్ జీవితాన్ని నేటి సమాజానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శంకరన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ట్రస్ట్ ప్రతినిధులు సాయిబాబు, సిహెచ్.కోటేశ్వరరావు, ఆవుల శేఖర్, పెరవల్లి సుబ్బారావు, పీర్ల శ్రీధర్, వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ దివ్య, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు లంకేశ్వరరావు, సురేష్ తదితరులు ఉన్నారు.

### వక్కలగడ్డలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

చల్లపల్లి : విశ్రాంత ఈవోఆర్డీ దాసి సీతారామరాజు వితరణగా అందజేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఐఆర్ఎస్ అధికారి ఉప్పులేటి దేవీప్రసాద్, సచివాలయ న్యాయశాఖ డిప్యూటీ సెక్రటరీ వెలగలపల్లి వెంకటేశ్వరరావు వక్కలగడ్డ దళితవాడలో సోమవారం ఆవిష్కరించారు. ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్, పంతగాని రమేష్, రాజులపాటి కళ్యాణి, వల్లూరు ఉమా, మట్టా కోమలి, పరిశె మల్లీశ్వరి, తాతినేని సుజాతకుమారి, దళిత నేతలు దోవా గోవర్ధన్, మంచాల నాగమల్లీశ్వరి, మత్తే నాగరాజ్, గుర్రం రామారావు, బట్టు శ్యాం, కృష్ణకుమారి, వీరాస్వామి తదితరులు ప్రసంగించారు. డయాలసిస్ చేయించుకుంటున్నా ఆరోగ్యాన్ని లెక్కచేయక విగ్రహ ఆవిష్కరణకు విశేష కృషి చేసిన దాసి చందుబాబును అతిథులు ఘనంగా సత్కరించారు.

### రక్షిత మంచినీటి పథకం పనులకు శంకుస్థాపన

అవనిగడ్డ రూరల్ : రామచంద్రపురం గ్రామంలో మంచినీటి పథకం ఆధునీకరణ పనులకు ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సత్యనారాయణ, జనసేన మండల అధ్యక్షుడు గుడివాక శేషుబాబు, అప్పారావు పాల్గొన్నారు.

### విజయా అకాడమి సేవలు అభినందనీయం

చల్లపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : గర్వదాయకమైన విద్యాసంస్థ విజయా అకాడమీ అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. విజయా అకాడమీ 44వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రంగనాథబాబును విద్యార్థులు రోల్ మోడల్‌గా తీసుకోవాలని సూచించారు. ఆయుష్ హాస్పటల్స్ ఎండీ డాక్టర్ యార్లగడ్డ రమేష్ బాబు, శారదా ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ డైరెక్టర్ యార్లగడ్డ శారదాదేవి, విజయా అకాడమీ చైర్మన్, ఎన్నారై గొర్రెపాటి రంగనాథబాబు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, మాజీ ఎంపీపీ యార్లగడ్డ లంకబాబు, స్వచ్ఛ చల్లపల్లి సారథులు డాక్టర్ డీఆర్‌కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతి, కరస్పాండెంట్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు, కొండపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు బహుమతులు అందచేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



కలెక్టర్ బాలాజీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పెడన మునిసిపల్ కమిషనర్ గోపాలరావు

## పెడనలో ఐదుగురికి ఉత్తమ సేవా అవార్డులు

పెడన, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పెడన మునిసిపాలిటీకి చెందిన ఐదుగురు ఉద్యోగులకు అవార్డులు లభించాయి. విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు పెడన మునిసిపల్ కమిషనర్ ఎం. గోపాలరావు, మేనేజర్ మట్టా రాజా, జూనియర్ అసిస్టెంట్ టి. రాజేశ్వరరావు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పామర్తి జితేంద్ర, వార్డు వెల్ఫేర్ సెక్రటరీ సమద్, స్వీపర్ పి. వెంకటేశ్వరమ్మలకు సేవా అవార్డులు దక్కాయి. మచిలీపట్నం పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన రిపబ్లిక్ వేడుకలలో కలెక్టర్ డీకే బాలాజీ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. వీరిని చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అభినందించారు.



## ఎంపీడీవో సుధాప్రవీణ్‌కు సత్కారం

కోడూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ వేడుకల్లో మచిలీపట్నంలో జిల్లా కలెక్టర్ డికె.బాలాజీ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్న ఎంపీడీవో సుధా ప్రవీణ్‌ను ఘనంగా సత్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శి బండే శేషగిరిరావు ఆధ్వర్యంలో పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కొండవీటి వెంకట నారాయణ, కడవకొల్లు సుధీర్, వివిధ గ్రామపంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.



## ఏఈ రవితేజకు సత్కారం

నాగాయలంక, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవా అవార్డు అందుకున్న నాగాయలంక ఇరిగేషన్ సెక్షన్ ఏఈ పొన్నూరు రవితేజను కార్యాలయంలో సోమవారం ఘనంగా సత్కరించారు. డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ కార్యాలయ అసిస్టెంట్, సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

## రాయల పాలన స్వర్ణయుగం

మచిలీపట్నం టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాయలయుగం స్వర్ణయుగమని, సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు అందరికీ ఆదర్శమని శ్రీకృష్ణదేవరాయల సేవాసమితి వ్యవస్థాపకుడు యర్రంశెట్టి వెంకటరత్నం అన్నారు. శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకలు సోమవారం భాస్కరపురంలో జరిగాయి. యర్రంశెట్టి వెంకటరత్నం, పంతం గజేంద్ర, మాజీ కౌన్సిలర్ కొట్టె వెంకట్రావు, లంకిశెట్టి బాలాజీ తదితరులు పాల్గొని రాయల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వడ్లమూడి చిన్న, జక్కా ధర్మారాయుడు, తోట రంగనాథ్, చలమలశెట్టి రామకృష్ణ, సాయన సుశీలరావు, సుంకర రాజశేఖర్, కంచర్లపల్లి రామారావు, వడ్లమూడి ప్రసాద్, వన్నెంరెడ్డి ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఈవోపీఆర్డీ జయరామకు పలువురి అభినందన

పెడన రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : ఉత్తమ సేవకునిగా కలెక్టర్ డీకే బాలాజీ నుంచి ప్రశంసా పత్రం అందుకున్న ఈవోపీఆర్డీ ఎం.జయరామ సచివాలయ ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది సోమవారం అభినందించారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి : ఎస్పీ

మచిలీపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు పోలీస్ అధికారులు దృష్టి సారించాలని ఎస్పీ ఆర్ గంగాధరరావు అన్నారు. జిల్లా పోలీస్‌కార్యాలయంలో సోమవారం నేర సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని అన్ని దేవాలయాలు, మసీదులు, చర్చిల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. స్నేహపూర్వక పోలీసింగ్‌ను జిల్లాలో అమలు చేయాలన్నారు. సైబర్‌నేరాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో వాటి కట్టడికి దృష్టిసారించాలని అన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌పరిధిలో నిఘాను పెంచాలన్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఏఎస్పీ వీవీ నాయుడు, గన్నవరం డీఎస్పీ శ్రీనివాసరావు, బందరు డీఎస్పీ చప్పిడి రాజా, అవనిగడ్డ డీఎస్పీ టి.వి ద్యశ్రీ, గుడివాడ డీఎస్పీ వి ధీరజ్‌వినీల్ సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## స్వీపర్ మరియమ్మకు రుణమాఫీ

మచిలీపట్నం టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పోలీసు శాఖలో స్వీపర్‌గా పనిచేస్తున్న మరియమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె జిల్లా పోలీసు కో ఆపరేటివ్ సొసైటీకి చెల్లించాల్సిన రుణం రూ. 1,36,226ను బీమా పరిహారం ద్వారా జిల్లా ఎస్పీ మాఫీ చేయించారు. రుణం క్లియర్ చేసిన సర్టిఫికెట్‌ను సోమవారం మరియమ్మ కుమారుడు ప్రసాద్‌కు ఆయన అందజేశారు. మట్టి ఖర్చుల కోసం రూ. 10వేలు అందజేశారు. కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మేనేజర్ మూర్తి, అకౌంటెంట్ నెహ్రూ, సంఘ అధ్యక్షుడు జి.వి. శేషగిరిరావు, కార్యదర్శి బి.వి. చెన్నకేశవులు పాల్గొన్నారు.

## బందరులో యువగళం విజయోత్సవం

మచిలీపట్నం టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ తదితరులు కేకు కట్ చేశారు. నగర టీడీపీ అధ్యక్షుడు ఎండి ఇలియాస్ పాషా, కార్యదర్శి పిప్పళ్ల కాంతారావు, మరకాని పరబ్రహ్మం, బొడ్డు నాగరాజు, గోకుల శివ, అజీమ్, ఫణికుమార్ పాల్గొన్నారు.

## ఆత్మవిశ్వాసంతో కృషి చేస్తే విజయం తథ్యం

అవనిగడ్డ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆత్మవిశ్వాసం, పట్టుదలతో కృషి చేస్తే విజయం తథ్యమని ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు అన్నారు. ఎస్‌వీఎల్‌క్రాంతి కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు లక్ష్య నిర్దేశన చేసుకుని సాధనకు కృషి చేయాలన్నారు. కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.జాలచంద్రరావు, డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎన్.వి.నాగేశ్వరరావు, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.











ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ల్యాబ్ పరికరాలు అందిస్తున్న డాక్టర్ రాసంశెట్టి చంద్రశేఖర్

## ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ల్యాబ్ పరికరాల వితరణ

అవనిగడ్డ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పూర్వ విద్యార్థి డాక్టర్ రాసంశెట్టి చంద్రశేఖర్ రూ.30 వేల విలువైన ల్యాబ్ పరికరాలను అందజేశారు. మచిలీపట్నంలో ప్రముఖ వైద్యునిగా పేరొందిన రాసంశెట్టి చంద్రశేఖర్ తాను విద్యనభ్యసించిన కళాశాలలో విద్యా ప్రమాణాల అభివృద్ధి కోసం భౌతిక శాస్త్ర ప్రయోగశాలకు అవసరమైన రూ.30 వేల విలువైన పరికరాలను ప్రిన్సిపాల్ ఎన్.వి.నరసింహారావుకు పూర్వ అధ్యాపకులు దివంగత సూర్యనారాయణమూర్తి జ్ఞాపకార్థం అందజేశారు. కళాశాల అధ్యాపక బృందంతోపాటు జి.శ్రీధర్, ఎస్.వెంకట స్వామి, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలోనే పారిశ్రామికాభివృద్ధి

కృత్తివెన్ను, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే పారిశ్రామికాభివృద్ధి సాధ్యమౌతోందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లోకేష్ దావోస్ పర్యటనతో రాష్ట్రానికి పెట్టుబడులు రావటం హర్షణీయమన్నారు. మంత్రి లోకేష్ యువగళం చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఒడుగు తులసీరావు, పిన్నెంటి రత్తయ్య, కూనసాని శ్రీనివాసరావు, కూనసాని చిన్న, నాగిడి చెన్నకేశవరావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

## లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం

అవనిగడ్డ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అరాచక పాలనలో స్వేచ్ఛ లేకుండా పోయిన రాష్ట్రప్రజలకు తన పాదయాత్ర ద్వారా భరోసా కల్పించిన గొప్ప నాయకుడు నారా లోకేష్ అని నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. యువగళం పాదయాత్ర రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం అవనిగడ్డ వంతెన సెంటర్‌లో విజయోత్సవం నిర్వహించి నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బొబ్బా గోవర్ధన్, కొల్లూరి వెంకటేశ్వరరావు, మెండు లక్ష్మణరావు, షేక్ బాబావలి, కర్రా సుధాకర్, లుక్కా పిచ్చియ్య, బొబ్బా ప్రసాద్, డొకిపర్తి బాలకోటేశ్వరరావు, మేడికొండ విజయ్, రత్నారావు, రావి రత్నగిరి తదితరులు పాల్గొన్నారు.



## టీచర్ కుటుంబం ప్రోత్సాహం

పెడన రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : తెలుగు భాషను ప్రోత్సహించాలని జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్ అన్నారు. పెనుమల్లి ఉన్నత పాఠశాల తెలుగు టీచర్‌గా పని చేసిన వరలక్ష్మి పేరున వారి కుటుంబ సభ్యులు పెనుమల్లి హైస్కూల్‌లో పదో తరగతి చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.5000, రూ.3000, రూ.2000 చొప్పున అందజేశారు. ప్రతి సంవత్సరం నగదు ప్రోత్సాహకం అందజేస్తామన్నారు. మరో పూర్వ విద్యార్థి పాఠశాల అభివృద్ధికి రూ. 50 వేలు అందజేశారు. పాఠశాల కమిటీ చైర్మన్ కాట్రగడ్డ నాగరాజు, హెచ్‌యం విజయకుమారి పాల్గొన్నారు.

## పద్య సాహిత్యానికి ఎంతో ప్రాధాన్యం

మచిలీపట్నం టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సాహిత్యంలో పద్య సాహితీ ప్రక్రియకు ఎంతో ప్రాధాన్యత ఉందని పాలకొల్లు జూనియర్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్, పద్యకవి వీర వెంకట సత్యనారాయణమూర్తి అన్నారు. ఆంధ్రసారస్వత సమితి ఆధ్వర్యంలో బాలాజీ విద్యాలయంలో జరిగిన సాహిత్య కార్యక్రమంలో శ్రీనాథుడు, పోతన, అల్లసాని పెద్దన పద్యాలను సత్యనారాయణమూర్తి ఆలపించి, తెలుగుపద్యం గొప్పతనాన్ని తెలియచేశారు. ఆంధ్రసారస్వత సమితి అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రసధుని అధ్యక్షుడు కుట్టి భాస్కరరావు, కార్యదర్శి యర్రంశెట్టి వెంకటరత్నం, ఆంధ్రసారస్వత సమితి కార్యదర్శి అప్పినీడి పోతరాజు, కొట్టె వెంకట్రావు, వడ్లమూడి చిన్నా, సవరం వెంకటేశ్వరరావు, కారుమూరి రాజేంద్రప్రసాద్, మేడిశెట్టి యోగేశ్వరరావు, నరసయ్య, మహమ్మద్ హాజీబేగ్, పూర్ణచంద్రరావు, లంకిశెట్టి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## పాడి పరిశ్రమతో రైతుకు దన్ను



పెడన రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పాడి పరిశ్రమ రైతుకు ఆర్థిక దన్నుగా నిలుస్తుందని జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్ అన్నారు. పెనుమల్లి, నేలకొండపల్లి, శేరీవర్తర్లపల్లి గ్రామాలలో ఉచిత పశు వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించారు. పశువులలో గర్భకోశ వ్యాధులను గుర్తించి చికిత్స అందించారు. నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. 266 పశువులు, గొర్రెలు, కోళ్లకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. సర్పంచి గరికపాటి రామానాయుడు, శీరం ప్రసాద్, వెంకయ్య, డాక్టర్ అల్తాఫ్ హుస్సేన్, వెంకటేశ్వరరావు, సూరిబాబు, కోటేశ్వరరావు, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.